

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఉత్తరాంధ్ర
సోమవారం
29-7-2024
పేజీలు 6
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం


# అల్లుడు గారి గిల్లుడు!




-దేవాదాయశాఖ భూములపై కన్ను -అధికారులపై వత్తిడి
-ప్రభుత్వానికి చెడ్డపేరంటూ మదనపడుతున్న కూటమి
నాయకులు -పోరుకు సిద్ధమవుతున్న సీపీఎం



**అనకాపల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** అనకాపల్లిలో దేవాదాయశాఖ భూముల ఆక్రమణ పర్వం వైరల్ గా మారింది. 95 శాతం ప్రజలు ఈ చర్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. మాజీమంత్రి కుటుంబంలో సూపర్ గా చెలామణి అవుతున్న అల్లుడి గారి ఘనకార్యమే ఇదంతా అని నెంబర్ 66 లో సుమారు 29.71 ఎకరాల భూమి అనకాపల్లి ఫూల్ బాగ్ రోడ్ లో ఉంది. మార్కెట్ విలువ ప్రకారం సుమారు 1100 కోట్ల రూపాయలు ఉంది. ఈ భూమి తమకు చెందుతుంది అంటూ అనకాపల్లికి చెందిన కొణతాల రజనీ, బొడ్డేడ మిగతా 2లో

# గ్రేటర్ 'స్టాండింగ్ 'ధర రూ.20లక్షలు!

## 'స్టాండింగ్' ఎన్నికల్లో టీడీపీ ఆఫర్ల ధమాకా

**పిఏరావు**
**(సూర్య బ్యూరో–విశాఖపట్నం)**

'గ్రేటర్' పీఠంపై 'పచ్చ' జెండాను ఎగరవేయాలనే ఆశలో వున్న టీడీపీ.. ప్రస్తుతం 'స్టాండింగ్' కమిటీని చేజిక్కించుకోవాలనే యోచనలో వుంది. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి అత్యధిక కార్పొరేటర్లు వుండడంతో.. ఆ కార్పొరేటర్లను చేర్చుకోవడంపై ఇటీవల వరకూ టీడీపీతో పాటు జనసేన కూడా ఆసక్తి చూపించింది. అయితే.. ఈ 'స్టాండింగ్' కమిటీ కోసం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీ తమ పార్టీలో చేర్చుకున్నా... జనసేన మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇక్కడ నాయకత్వం దాదాపు ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను చేర్చుకోవాలనుకున్నా.. వార్డుల్లో స్థానికంగా వున్న నాయకత్వం వ్యతిరేకతను ఫిర్యాదులు రూపంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు అందించారు. దీంతో, చేరికలు ఇప్పట్లో వద్దు అంటూ హుకుం జారీచేయడంతో, జనసేనలో చేరాలనుకున్న కార్పొరేటర్లు ఆ పార్టీ మిగతా 2లో



## పరవాడ మండలంలో ప్రభుత్వ ఉద్యోగులొద్దు

# అనధికార వ్యక్తులే ముద్దు

-మండల ఇంజనీరింగ్ అధికారిగా అనధికార వ్యక్తి?
-ఉన్న ఇంజనీర్‌ను రాజకీయ కారణాలతో డిప్యుటేషన్



**అనకాపల్లి ప్రతినిధి, జూలై 28, మేజర్‌న్యూస్:** జిల్లాలోని పరవాడ మండల పరిషత్ లో ప్రభుత్వ అధికారులు వద్దు అనాధకార వ్యక్తులే ముద్దు అంటూ మండల ఇంజనీరింగ్ అధికారి కార్యాలయంలో ఒక ప్రైవేటు వ్యక్తిని నియమించి పనులు జరిగే విధంగా ఇంజనీరింగ్ శాఖ అధికారులు చూస్తున్నారు. మండలంలో ఇంజనీర్ గా పని చేస్తున్న రామారావును రాజకీయ కారణాలతో డిప్యూటేషన్ పై బయటకు పంపించేశారు. సబ్బవరం ఇంజనీరింగ్ అధికారికి పరవాడ మండల ఇంజనీర్ బాధ్యతలను అప్పగించడంతో ఆయన కాస్త పరవాడ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తిని నియమించి కార్యాలయాన్ని నడిపిస్తున్నారు .దీంతో మండలంలో ఉన్న గ్రామ మిగతా 2లో

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు సరైనదే

జన చైతన్య వేదిక సదస్సులో స్వాగతించిన పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి పి.వి. రమేష్



**విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్:** లోప భూయిష్టమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను కూటమి ప్రభుత్వం రద్దు చేయటం పట్ల పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ పి.వి. రమేష్ హర్షం వ్యక్తం చేశారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హెూటల్ దసపల్లా లో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి – తక్షణ కర్తవ్యాలపై జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన పి.వి. రమేష్ ప్రసంగిస్తూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతులలో గందరగోళ పరిస్థితి కల్పించిందని, భూ కబ్జాలు, ఆక్రమణకు అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా మిగతా 2లో

## జీవీఎంసీలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

-నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి
-జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్




**విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జులై 29వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున,నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజనీరింగ్ మొదలగు విభాగాలకు మిగతా 2లో

# విద్యార్థులు నిర్దేశిత గమ్యస్థానాలు చేరుకోవాలి

-చిత్తశుద్ధి క్రమశిక్షణ పురోగతికి సోపానాలు
-జోగింపేట కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ శ్యాం ప్రసాద్



**పార్వతీపురం, జూలై 28, మేజర్‌న్యూస్:** విద్యార్థులు వారి వారి అభిలాష మేరకు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటికి చేరువ అయ్యేందుకు చిత్తశుద్ధి క్రమశిక్షణతో పాటు సమయపాలనతో ముందడుగు వేస్తే లక్ష సాధన కష్టం కాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను పసిగట్టి ఆఫీసులో వారికి తర్ఫీదు ఇస్తే మంచి ఫలితాలు వస్తాయని కష్టంతో కాకుండా ఇష్టంగా చదివే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం సీతానగరం మండలం జోగంపేట గ్రామంలో గల కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ను పరిశీలించారు. ముందుగా కళాశాల ఆవరణలోని వంటగది సామాగ్రి నిలవ ప్రాంతాలు క్రీడల మైదానం తో పాటు తరగతి గదులు ఇతరత్రా అన్ని విషయాలను పరిశీలించి ఉపాధ్యాయులను సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతోపాటు ఆటల్లో పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. అలాగే భోజన శాలలో విద్యార్థులతో పాటు కూర్చొని అమలవుతున్న మెనూ అందజేస్తున్న ఆహార పరిశుభ్రత ఇతరత్రా విషయాలపై నేరుగా అడిగి తెలుసుకున్నారు.

**విద్యార్థుల్లో పట్టుదల మరింత అవసరం..**
**వేర్వరు ప్రాంతాల నుండి**

అతి సామాన్య నిరుపేద గిరిజన కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణం లో లక్ష్యసాధనకు నిరంతర కృషి చేయాలని విద్యార్థి దశలోనే కష్టపడే తత్వం అలవాటు పడితే భవిష్యత్తు జీవితం ఆనందదాయకంగా ఉంటుందని ఇతవు పలికారు. ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా విద్యార్థులను శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తు బంగారు బాటకు మిగతా 2లో

# గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

-విజయనగరం జిల్లా ఎస్సీ వకుల్ జిందల్, -గంజాయి సమాచారాన్ని టాస్క్ ఫోర్స్ సిఐ 91211 09416 అందించాలని కోరిన జిల్లా ఎస్పీ -ఆకస్మికంగా వాహన తనిఖీలు, లాడ్జ్ తనిఖీలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు -గంజాయి నేరాలకు తరుచూ పాల్పడే నిందితులపై పి.డి.చట్టం ప్రయోగిస్తామన్న జిల్లా ఎస్పీ



**విజయనగరం క్రైమ్, జూలై 28, మేజర్‌న్యూస్:** విజయనగరం జిల్లాలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూలై 28న తెలిపారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు అన్ని రకాలైన కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు వచ్చే అన్ని రహదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామ న్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, వాహన తనిఖీలను ఒకే ప్రాంతంలో కాకుండా రోజూ వేరు వేరు ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టాలని, వాహనాల ను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, వాహనాల రికార్డులను పరిశీలించాలని, నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు ఈ- చలానాలు విధించాలన్నారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు, గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకొనేందుకు, వారికి గంజాయి సరఫరా చేసే వ్యాపారులను గుర్తించేందుకు, వారు ఎవరి వద్ద నుండి పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారన్న విషయాలను రాబట్టేందుకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని నియమించామన్నారు. ఈ బృందాలు జిల్లాలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, గంజాయి సేవించి, అల్లర్లుకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారిపై చట్టపరమైన తదుపరి చర్యలు చేపట్టేందుకు స్థానిక పోలీసులకు అప్పగిస్తారన్నారు. అంతేకాకుండా, వారికి గంజాయి సరఫరా చేస్తున్న చిన్న వ్యాపారులను, వారికి పెద్ద మొత్తంలో విక్రయించే పెద్ద వ్యాపారులను, వారికి గంజాయిని విక్రయించే వ్యక్తులను గుర్తించి, గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా ఈ ప్రత్యేక బృందం పని చేస్తుందన్నారు. గంజాయి అక్రమ రవాణకు పాల్పడే వ్యక్తులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అన్నారు. గంజాయి అక్రమ రవాణ, సేవించడం, విక్రయాలు జరిపేనిందితులుపదే పదే నేరాలకు పాల్పడి, పట్టుబడితే వారిపై పి.డి. చట్టం ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. విజయనగరం పట్టణంలో ఆర్టీసి కాంప్లెక్స్, గూడ్సు షెడ్, రైల్వే స్టేషను ప్రాంతాల్లో ఇప్పటికే నిఘా పెట్టామన్నారు. విజయనగరం 1వ పట్టణ పరిధిలో గంజాయి అక్రమంగా కలిగిన మండల శాంతి, మస్తానీ, బొంతు వెంకటేశ్వరరావు, బాబూసింగ్, అలజంగి ప్రసాద్ అనే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుండి 8కిలోల గంజాయిని మిగతా 2లో

# ట్రాఫిక్ పోలీసుల అతి

## వాహనదారుడ్ని కొట్టడంతో స్పృహ తప్పిపోయిన బాధితుడు



**విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్:** ట్రాఫిక్ పోలీసుల అతి ఓ వ్యక్తి ప్రాణాపాయంపైకి తెచ్చింది. లక్ష్యసాధనకు వాహనదారుల్ని టార్గెట్ చేస్తుండడం మనుషుల ప్రాణాలపైకి వెళ్తోంది. డ్రంకెన్ డ్రైవ్ కేసుల పేరిట వాహనాల్ని నిలువరించి కేసుల నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్న సంఘటనలు దారి తప్పుతున్నాయి. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా ఖాకీలు మిగతా 2లో

## రిజర్వ్ ప్లటూన్‌లో పట్టపురాణి..

- ఏసీపీ అండతో చెలరేగిపోతున్న రైటరమ్మ
- 15 మందితో ప్రత్యేక వర్గం ఏర్పాటు

# చేసేదంతా గూడు పుఠాణి..!

- ఆ వర్గంలో లేని వారికి మాత్రం వేధింపులే వేధింపులు



2లో


**విలేకరులు కావలెను**

బడుగు, బలహీన వర్గాల ఐక్యతాగళాన్ని 'కలం'తో వినిపిస్తూ..
సంచలన దినపత్రికగా వెలుగొందుతున్న
నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు విలేకరులు కావలెను.
ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీగా వున్న మండలాల్లో పనిచేసేందుకు
ఆసక్తి కలిగిన అభ్యర్థులు కావలెను.

**ఖాళీగా వున్న మండలాలు ఇవి...**

గాజువాక, ములగాడ, పెదగంట్యాడ, అగనంపూడి, లంకెలపాలెం, అచ్యుతాపురం, నక్కపల్లి, ఎస్ రాయవరం, మాకవరపాలెం, కొయ్యూరు, నాతవరం, చింతపల్లి

ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంప్రదించాల్సిన నెంబర్లు:
7207720737, 7013546540,
9848238376

సూర్య
డోర్ నెం. 50-109-4, ఈనాడు పాత కార్యాలయం గేటు ఎదుట రోడ్డు
సీతమ్మధార, విశాఖపట్నం- 530013


## దేవాదాయ భూములను ఆక్రమిస్తున్న వారిని అరెస్టు చేయాలి

సిపిఎం డిమాండ్



**అనకాపల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యం లో సిపిఎం కార్యాలయంలో ఆదివారం పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గంట శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకర్రావు, వి వి శ్రీనివాసరావులు మాట్లాడుతూ అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పూల్ బాగ్ రాణిగారితోట మిగతా 2లో

# జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు



2లో

-మంజూరు చేస్తామన్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు -జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమన్న టిడిపి సీనియర్ నేత పట్టాభి -తెలుగు జర్నలిస్ట్స్ ఫోరం బలమైన శక్తిగా ఎదగాలన్న రాజ్ న్యూస్ ఛానెల్ అధినేత రాజేంద్ర ప్రసాద్

## రిజర్వ్ ప్లటూన్‌లో పట్టపురాణి..
# చేసేదంతా గూడు పురాణి..!

**విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్ :** ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ ఉమెన్ ప్లటూన్‌ను ఓ రైటర్ ఆటాడుకుంటోంది. తన ఇష్టానుసారం ఆ శాఖను కనుసన్నల్లో పెట్టుకుని ఓ 15 మందితో గ్రూప్‌ను తయారు చేసుకుంది. ఆ గ్రూప్ సభ్యులు రోస్టర్ ప్రకారం డ్యూటీలు చేయరు. కానీ ఆ గ్రూపునకు చెందని ఇతర ఉమెన్ కానిస్టేబుళ్లతో మాత్రం ఆ రైటరమ్మ మామూలుగా ఆడుకోదు. ఎప్పుడు డ్యూటీ వేస్తుందో...ఆమెకే తెలీదన్నట్టుగా వ్యవహారం ఉంటోంది. ఇంతకీ ఆమెకు ఆ విభాగంలో ఆమెకు అంతలా కొమ్ములు రావడానికి ఆ ప్లటూన్ ఏసీపీ ఆమె బుట్టలో ఉండడమే కారణంగా అక్కడ ఎవరిని కదిపినా ఇట్టే చెబుతున్నారంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. ఇంతకీ ఈ విభాగం విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో సిటీ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ ఉమెన్స్ ప్లటూన్ పేరుతో ఉంటుంది. మొత్తం 54 మంది ఉమెన్ పోలీస్ కానిస్టేబుళ్లు ఉండే ఈ విభాగంలో 9 మంది ఉమెన్ హెడ్ కానిస్టేబుళ్లు కాగా...45 మంది ఉమెన్ కానిస్టేబుళ్లున్నారు. వీరిని పర్యవేక్షించేందుకు ఏసీపీ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్, డ్యూటీ ఆఫీసర్ లుంటారు. అయితే ఈ మొత్తం కానిస్టేబుళ్లకు నిరంతరం విధులు అప్పగించే బాధ్యత మాత్రం ప్లటూన్ రైటర్‌గా లక్ష్మీ దేవి పేరు వచ్చే ఓ కానిస్టేబుల్ వ్యవహరిస్తున్నారు. ఆమెకు ముందు మరో కానిస్టేబుల్ రైటర్‌గా ఉండే వారు. ఆమె కొద్ది రోజులు శెలవు పెడితే ఆ స్థానంలో ఇన్‌ఛార్జిగా అడుగు పెట్టిన సదరు లక్ష్మీ దేవి ఆ సీటులో అతుక్కుపోయారు. ఆ ప్లటూన్ ఏసీపీతో అత్యంత చనువుగా వుండే మరో మహిళా కానిస్టేబుల్‌తో సదరు రైటర్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటారు. దీంతో కానిస్టేబుళ్లపై ఈ రైటర్ అజమాయిషీ అంత మామూలుగా ఉండదు. డ్యూటీ చేసిన వారికే మళ్లీ మళ్లీ డ్యూటీలు వేస్తుంటుంది. ఇదేమని అడిగితే వాళ్ల సంగతి పోలీస్ శాఖలో ఎలా ఉంటుందో చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఆ రైటర్ మాట అంటే...అంతే మరి. న్యాయం అన్న సంగతి అక్కడ మరచిపోవాల్సిందే...రైటర్‌కు ఏసీపీకి మధ్య ఓ 'మణి పూస లాంటి ఒప్పందాలు జరుగుతుండడం కారణంగా రోస్టర్‌తో ఎలాంటి సంబంధాలు లేకుండా కొందరు అభాగ్యులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తమ గోడు ఎవరికి చెప్పుకున్నా అరణ్యరోదనగానే మిగిలిపోతుందన్న ఆవేదన ఆ మహిళా కానిస్టేబుళ్లలో వ్యక్తమవుతోంది. రోస్టర్ ప్రకారం విధులు వేయాలని ఎవరైనా కానిస్టేబుల్ అడిగితే శెలవులు ఆపేయడం...డ్యూటీలు ఇష్టానుసారం వేయడం... వేళకాని వేళలో ఫోన్ చేసి విధులకు హాజరు కావాలని చెప్పడం...ఉన్నతాధికారులకు చాడీలు చెప్పడం...వేధించడం ఇలా ఒక్క రకంగా కాకుండా నానా ఇబ్బందులు పెడుతుంటారని కన్నీరు మున్నీరవుతున్నారంటే ఎంత టెన్షన్‌తో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందో ఊహించుకోవచ్చు. రిజర్వ్ ఉమెన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కూడా ఈ రైటర్ ఖాతరు చేయదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే చెప్పవచ్చు. రోస్టర్ బుక్ పరిశీలిస్తే తమ వర్గం చేసే విధులు...ఇతరులు చేసే విధులు ఇట్టే సరిపోల్చవచ్చు. ఈ విభాగంలో జరుగుతున్న అక్రమాల తంతును ఓ సారి పోలీస్ కమిషనర్ స్వయంగా పర్యవేక్షిస్తే అసలు గుట్టు బయట

# జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు



**విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్:** విజయవాడ కేంద్రంగా తెలుగు జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పట్టాభి, రాజ్ న్యూస్ ఛానల్ గ్రూప్ ఎండీ రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్13 జిల్లాలలో ఉన్న సీనియర్ జర్నలిస్టులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సన్మానం చేశారు. జర్నలిస్టు అంటే చంద్రబాబు నాయుడుకి అమితమైన ప్రేమాభిమానాలు ఉన్నాయని గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలన చేశాడని జర్నలిస్టులపై దాడులుతో పాటు జర్నలిస్టుల గొంతును కూడా నొక్కేశాడని పత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు . రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తామని పత్తిపాటి పుల్లారావు టీజేఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పట్టాభి మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల జర్నలిస్టులు అందరూ టీజేఎఫ్ ఆధ్వర్యంలో మహాశక్తిగా ఎదగాలని, జర్నలిస్టులకు ఎలాంటి సమస్య ఉన్న నా దృష్టికి తీసుకు వస్తే నేరుగా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల కేటాయింపులో జర్నలిస్టులపై అనేక ఆంక్షలు విధించిన నేపథ్యంలో అలా కాకుండా అక్రిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టు కు ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.రాజ్ న్యూస్ ఛానల్ ఎండీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు హుందాతనంతో వ్యవహరించాలని నాయకులైనా వ్యాపారస్తులైనా వాళ్ళ వ్యక్తిగత జీవితాలకు పెద్దపీత వేయకుండా ప్రజా సమస్యలపై జర్నలిస్టులు దృష్టి పెట్టాలని సూచించారు. తెలుగు జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆత్మీయ సమావేశానికి వచ్చిన ప్రతి జర్నలిస్టుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 13 జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. తెలుగు జర్నలిస్ట్ ఫోరం ప్రెసిడెంట్ ఈశ్వర్ చౌదరి మాట్లాడుతూ తెలుగు జర్నలిస్ట్ ఫోరం లో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి హెల్త్ స్కీమ్ కి సంబంధించిన పన్నెండు వందల యాభై రూపాయలు టీజేఎఫ్ అందిస్తుందని వివరించారు తెలుగు జర్నలిస్ట్ ఫోరం రాబోయే రోజుల్లో మహా శక్తిగా ఎదుగుతుందని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న జర్నలిస్టులందరికీ ఒకే గూటికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియజేశారు తెలుగు జర్నలిస్ట్ ఫోరం ప్రధాన కార్యదర్శి కోనేరు క్రాంతి కుమార్ మాట్లాడుతూ నిరంతరం వృత్తిలో భాగంగా బిజీ బిజీగా ఉండే జర్నలిస్టులకు టీజేఎఫ్ నిరంతరం అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో టీజేఎఫ్‌లో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ సంబంధించినటువంటి 1,250 రూపాయలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు . కాకినాడ జిల్లాకు సంబంధించి టీజేఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఉన్న అప్పాజీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విజయవాడ కేంద్రంగా టీజేఎఫ్ తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నా మని వివరించారు. ముఖ్యంగా రన్ ఫర్ క్యాపిటల్ పేరుతో అమరావతిలో భారీ ర్యాలీ నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే తెలుగు జర్నలిస్ట్ ఫోరంకి తన వంతుగా 75 వేల రూపాయలు విరాళం అందజేశారు. తెలుగు జర్నలిస్ట్ ఫోరం ప్రధాన కార్యదర్శి కోనేరు క్రాంతికుమార్ కూడా టీజేఎఫ్‌కి రూ. 50 వేల ఆర్థిక సహకారాన్ని అందించారు.

# అల్లుడు గారి గిల్లుడు!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసరావు లు కోర్టును ఆశ్రయించారు. ఈ భూమి వివాదం దశాబ్దాల కాలంగా సాగుతుంది. చివరకు 2022 సెప్టెంబర్ లో సీసీఎల్ఏ కోర్టు, అంతకు ముందు ఆర్డీవో కోర్టు ఈ భూములు దేవాదాయశాఖ కు చెందుతాయని తీర్పును ఇచ్చాయి. వెంటనే దేవాదాయశాఖ అధికారులు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు సెక్యూరిటీ గార్డులను కూడా ఏర్పాటు చేసారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తన ఆటలు సాగకపోవడంతో ఇంతకాలం వేచి చూసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అల్లుడు గారి దృష్టి ఈ భూములపై పడింది. అసెంబ్లీలో వైసీపీ నాయకుల భూ దందాలపై చర్చలు జరిపిన వెంటనే అనకాపల్లిలో కూటమి నాయకులు దేవాదాయశాఖ భూముల ఆక్రమణకు ఒడిగట్టడంపై కూటమి పార్టీలలో అసంతృప్తి కనిపిస్తుంది. సుమారు 50 మంది దేవాదాయశాఖ భూమిలో కంచెను తొలగించి, బోర్డులను కూలదోసి, సెక్యూరిటీ గార్డులపై దౌర్జన్యం చేయడం దేనికి సంకేతం. అధికారంలో ఉన్న అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ భూముల్లోకి ఈ విధంగా ప్రవేశించడం ఏంటి ? వైసీపీ నాయకులకు, కూటమి నాయకులకూ తేడా ఏముంది ? ఆక్రమణదారులకు కోర్టు నుంచి ఎటువంటి ఆర్డర్ అయినా తెచ్చుకుంటే సదరు ఆర్డర్ దేవాదాయశాఖ అధికారులకు చూపించి సామరస్య వాతావరణంలో భూమిలోకి ప్రవేశించాలి. సీపీఎం నాయకులు, మీడియా వారు రంగప్రవేశం చేసాకా ఎందుకు పలాయనం చిత్తగించారు ? ఇది ముమ్మాటికీ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే విషయంగా అంతా భావిస్తున్నారు. దీనిపై ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పందన ఏంటి ? అధికార పార్టీ నాయకులు ఆక్రమణకు పాల్పడ్డారని ప్రతిపక్షాలు బాహాటంగా ఆరోపణలు చేస్తుంటే ప్రజా ప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదు ? దేవాదాయశాఖ అధికారులు స్వయంగా ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదు ? పోలీస్, దేవాదాయశాఖ అధికారులపై తీవ్ర స్థాయిలో వత్తిడులు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు దెబ్బతిన్న పులిలా సీపీఎం నాయకులు ప్రజా పోరాటాలకు సిద్ధం అవుతున్నారు. ఎందుకంటే గతంలో ఈ భూముల్లోకి సీపీఎం నాయకులు ప్రవేశించి పేదలకు ఇళ్లు ఇవ్వాలంటూ జెండాలు పాతారు. దేవాదాయశాఖ అధికారులు రంగప్రవేశం చేసి సీపీఎం నాయకులపై కేసులు నమోదు చేసారు. సీపీఎం నాయకులు విషయంలో దేవాదాయశాఖ అధికారులు అలా స్పందించారు ? ఇపుడు అధికారపార్టీ నాయకుల వరకూ వచ్చేసరికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారు ? కాగా ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే పాత్ర కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఎం వర్గాలు ధర్నా చేపడుతున్నారు. అప్పటికీ అధికార యంత్రాంగం నుంచి స్పందన లేకుంటే పోరాటాన్ని రాష్ట్ర స్థాయిలో చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

# గ్రేటర్ 'స్టాండింగ్ 'ధర రూ.20లక్షలు!

(మొదటి పేజీ తరువాయి)

తీర్థం పుచ్చుకోలేకపోయారు. ఈ రాజకీయ పరిణామాలకు సంబంధించిన అంశాలను పక్కనపెడితే... రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన జీవీఎంసీలో తమ ఆధిపత్యాన్ని చాటుకోవాలనే యోచనలో టీడీపీ నాయకత్వం వుంది. ఆ యోచనలో భాగంగానే 'స్టాండింగ్' కమిటీని చేజిక్కించుకోవాలనుకుంది. అయితే... అధికార కూటమిలోని ముఖ్యమైన పార్టీ కావడంతో టీడీపీలో 'స్టాండింగ్' పదవులు కోసం పోటీ అధికంగానే వుంది. ఈ నేపథ్యంలో 'స్టాండింగ్' పదవులు కావాలనుకునే కార్పొరేటర్లకు బేరం పెట్టేసింది ఇక్కడ నాయకత్వం. ఎవరికైతే 'స్టాండింగ్' పదవి కావాలనుకున్న వారు రూ. 20లక్షలు ఇవ్వాల్సిందే అంటూ బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాసులు వర్షం కురిపించే ఈ పదవి కోసం టీడీపీలో అత్యధికులు పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. పది మంది సభ్యులు కలిగిన 'స్టాండింగ్' కమిటీ వారానికో సమావేశం నిర్వహించి మేయర్, కమిషనర్ సమక్షంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. రూ.50 లక్షలు లోపు వుండే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిర్ణయాలకు ఆమోదం తెలిపే అధికారం ఈ 'స్టాండింగ్' కమిటీకే వుంటోంది. ఇదిలావుండగా.. సాధారణ ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయఢంకా సాధించడంతో ఇప్పుడా మేయర్ పీఠాన్ని తామెలాగైనా కైవసం చేసుకుందామని టీడీపీ యోచిస్తోంది. అందుకోసం చట్టాన్ని మార్పు చేసి వైసీపీ కార్పొరేటర్లను తమవైపు లాక్కునేందుకు కొన్నాళ్లగా పార్టీ పెద్దలు అదే పనిలో ఉన్నారు. వైసీపీకి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు ఇప్పటికే టీడీపీలోకి వెళ్లిపోయారు. దాదాపు మరో ఐదుగురు జనసేన వైపు మొగ్గుచూపిస్తున్నారు. దీంతో కూటమి పార్టీలకు కార్పొరేటర్ల సంఖ్య పెరిగింది. కొన్నాళ్లలో చట్టంలో మార్పు తెచ్చి తమకు పెరిగిన బలం ఆధారంగా మేయర్ సీటును టీడీపీ కైవసం చేసుకునే యోచన ఉంది. 58మంది వైసీపీ కార్పొరేటర్లలో ఇప్పటికే 8 మంది టీడీపీ తీర్థం పుచ్చుకోగా దాదాపు మరో ఐదుగురు జనసేనలో చేరేందుకు సిద్ధంగా వున్నారు. వీరితో పాటు జంపింగ్ జిలానీలు కూడా దాదాపు మరో 20 మంది సభ్యులున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 'స్టాండింగ్'తో పాటు మేయర్ పీఠాన్ని కూడా చేజిక్కించుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలుస్తోంది.

**రూ.20లక్షలిస్తే 'స్టాండింగ్' పదవి!**

'స్టాండింగ్'లో 10మంది సభ్యులుంటారు. కీలక నిర్ణయాల్లో వీరిదే కీలక పాత్ర కావడంతో... నాకు సభ్యత్వం కావాలంటే.. నాకు కావాలంటూ టీడీపీలో ఆశావహులు అధికమైపోయారు. దీంతో 'స్టాండింగ్'లో పోటీ చేయాలంటే కనీసం రూ.20లక్షలివ్వాల్సిందేనంటూ పార్టీ పెద్దలు పోటీ పెట్టారు. స్థాయీ సంఘంలో సభ్యులుగా ఉంటే జీవీఎంసీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో పర్సంటేజీలొస్తాయి.

పేరుకు పేరూ వస్తుంది. దీంతో రూ.20లక్షలిచ్చేసి స్టాండిరగ్ కమిటీలో సభ్యత్వం పొందేందుకు కొంతమంది సిద్ధమైపోయారని తెలిసింది. ఆ ఆశావహులంతా త్వరలో నామినేషన్ దాఖలు చేసేందుకు కూడా నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# దేవాదాయ భూములను ఆక్రమిస్తున్న వారిని అరెస్టు చెయాలి

(మొదటి పేజీ తరువాయి)

సర్వేనెంబర్ 66 లోని 29.71 ఎకరాల శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన (అంబికా బాగ్) భూములు సుమారు 1150 కోట్లు విలువైన భూములు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న భూములును శనివారం కొంతమంది ఆక్రమించడానికి సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ భూములు పరిరక్షణకై చుట్టూ కంచె వేసి సెక్యూరిటీని కూడా దేవాదాయ శాఖ నియమించినప్పటికి పట్టపగలు కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఎండోమెంట్ బోర్డులను, కంచెను తొలగించి చదును చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ రోజుల్లో రాజకీయ నాయకులు వందల కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో పోటీ చేసి వేల కోట్లను విలువ చేసే భూములను కబ్జా చేయడం అలవాటైందని మండిపడ్డారు. ఇటువంటి వారిపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలపై, అవినీతిపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున శ్వేత పత్రాలు విడుదల చేసి ఆక్రమణలపైన, భూకబ్జాలపైన చర్చ జరుగుతున్న సమయంలో, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన మరుక్షణమే కోట్లాది రూపాయలు విలువైన భూములపై అధికార పార్టీ అండదండలతో ఈ ఆక్రమణకు పాల్పడుతున్నట్లుగా సిపిఎం భావిస్తుందని, ఈ భూములను ఎండోమెంట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల్కైన ఎంపీ ఎమ్మెల్యేలు వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వ భూములు దేవుడు భూములను సంరక్షించాలని సిపిఎం పార్టీ కోరుతోందన్నారు. గతంలో ఇదే భూములపై సిపిఎం పార్టీ జెండాలను పాతి ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరితే ఇది భూ ఆక్రమణ అని సిపిఎం నాయకులు పై కేసులు పెట్టడంతో పాటు ఇవి దేవాదాయ భూములను కాబట్టి ఇవి ఎవరికీ చెందవని అడ్డుకున్నారు. అలాంటి పరిస్థితుల్లో నేడు ప్రైవేటు వ్యక్తులు వచ్చి ప్రోక్లైన్లతో భూమిని చదును చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం మీన మీసాలు లెక్కచడం అన్యాయం అన్నారు. ఈ ఘటనపై తగిన విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వెంటనే ఎండోమెంట్ అధికారులు ఆక్రమిదారులపై కేసు నమోదు చేసి తగిన చర్యలకు ఉపక్రమించాలని, లేకపోతే ప్రజా పోరాటాలకు సిద్దం కావల్సి వస్తుందని సిపిఎం పార్టీ హెచ్చరిస్తోంది. అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, కాళ్ళ తేలయ్యబాబు, డిడి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు ఒక ప్రకటన ద్వారా వారు తెలిపారు.

# ట్రాఫిక్ పోలీసుల అతి

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేయడంతో సదరు వ్యక్తి స్పృహ తప్పిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గు జంక్షన్ వద్ద శనివారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. అటుగా వస్తున్న ఓ వాహనదారుడు పోలీసుల్ని తప్పించుకునే ప్రయత్నం చేయగా, ఓ ఏఎస్ఐ ఆయనపై దాడికి దిగాడు. దీంతో వాహనదారుడి తలపై దెబ్బలు తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. కోమాలోకే వెళ్లిపోయాడు. దీంతో స్థానికులు అక్కడకు చేరుకుని పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కేసులు నమోదు చేసి హడావుడి చేసేసే పోలీసులు మద్యం దుకాణాల్ని ఎందుకు మూయించలేకపోతున్నారని, వాహనదారుల్ని కొట్టే అధికారం ఎవరిచ్చారంటూ ఆందోళనకు దిగారు. పోలీసులపై ఎవరైనా దాడికి దిగితే పరిస్థితులెలా ఉంటాయో తమకు తెలియనిది కాదంటూ వాదించారు. పోలీసులు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా వారు వినలేదు. తొలుత క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించి చికిత్సకు సిఫారుసు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు కాబడిన నిందితులందరికీ గంజాయి సేవించే అలవాటు కలదని, వీరు ట్రెయిన్స్ లో తిరుగుతూ, ఒడిస్సా రాష్ట్రం రాయఘడ, పర్లాకిమిడి, బరంపురం వంటి ప్రాంతాల్లో కొద్ది మొత్తంలో గంజాయి కొనుగోలు చేసి, వాటిని చిన్న పొట్లాలుగా చేసి, పట్టణంలో గంజాయి అలవాటు ఉన్న వ్యక్తులకు రూ. 100/- లేదా రూ.200/- లకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. అదే విధంగా గూడ్సు షెడ్ ప్రాంతంలో గంజాయి సేవించిన మరో 8మందిని కూడా అదుపులోకి తీసుకొని, రిమాండుకు తరలించామన్నారు. గంజాయి సేవించినా, విక్రయించినా, అక్రమ రవాణకు పాల్పడినా వారిపై ఎన్.డి.పి.ఎస్. చట్టం క్రింద కేసులు నమోదు చెయ్యాలని అధికారులకు జిల్లా ఎస్పీఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. గంజాయి గురించిన సమాచారాన్ని టాస్క్ ఫోర్స్ సిఐ ఫోను నంబరుకు 9121109416కు అందించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రజలను కోరారు.

# విద్యార్థులు నిర్దేశిత గమ్యస్థానాలు చేరుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కారకులు కావాలని ఆరోగ్యంతో పాటు క్రీడా సంపత్తి ప ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతలను వెలికి తీసి విద్యార్థులు రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. నిబంధనల మేరకు లోటుపాట్లు తలెత్తకుండా అన్ని విధాల విద్యార్థులకు సదుపాయాల అందజేసే విధంగా ముందుకు పోవాలని అలసత్వం నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని సుత్తిమెత్తగా హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయండి.. ఇంటర్మీడియట్ తర్వాత జరగబోయే నీ జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ తదితర పోటీ పరీక్షలలో గిరిజన విద్యార్థులు నిలదొక్కుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ఇప్పటినుండే అనుసంధాన తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యతను అంచనా వేసి ఇప్పటినుండే ఆ దశగా తెల్ఫీ తీస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సంబంధిత పరీక్షలకు అవసరమైన మెటీరియల్ను సమకూర్చే బాధ్యత తీసుకోవాలని పూర్తి అవగాహనతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తే ఫలితాలు వాటంతట అవే వస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# పరవాడ మండలంలో ప్రభుత్వ ఉద్యోగులొద్దు అనధికార వ్యక్తులే ముద్దు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇంచార్జ్ మండలఇంజనీరింగ్ అధికారి తీరుపై గుర్రుగా ఉన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ సెక్షన్ లో అనధికారి వ్యక్తులను తొలగించి గ్రామస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సహాయ సహకారాలతో మండల ఇంజనీర్లు ఉద్యోగ విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. అయితే హఠాత్తుగా ఒక ప్రైవేటు వ్యక్తిని మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ సహాయకులుగా నియమించుకునే అర్హత లేనప్పటికిని మండల ఇంజనీరింగ్ అధికారిగా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి అనధికార వ్యక్తిని ఏరకంగా కార్యాలయంలో నియమిస్తారని అంటూ పలు ప్రజా సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే సదరు ఇంజనీరింగ్ అధికారి మాత్రం తనకు రెండు మండలాలు కావడంతో పని ఒత్తడి తోనే తన సహాయం కోసం నియమించుకున్నాని ధైర్యంగా , అడిగిన వారికి స్థానిక విలేకరులకు చెప్తున్నారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా తగ్గేదేలే అంటూ తన నిర్ణయాన్ని మార్చుకోకుండా ఉన్నారు. మండల ఇంజనీర్ పోస్టులో అధికారి లేనప్పుడు గ్రామస్థాయి సచివాలయంలో ఉన్న మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో తెలివైన వారికి మండల ఇంజనీరింగ్ అధికారి బాధ్యతలు అప్పగించి వచ్చని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని అయినప్పటికీని వీటిని కాదని ఇంచార్జ్ మండల ఇంజనీరింగ్ అధికారి ఒక ప్రైవేటు వ్యక్తిని మండల పరిషత్ కార్యాలయంలో తన అనుచరుడుగా ఇంజనీరింగ్ అధికారిగా చలామణి అవడానికి ఎలా అవకాశం కల్పిస్తారని అంటూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులమైన తమపై ఒక ప్రైవేటు వ్యక్తి అజమాయిసి చెలయేస్తానంటే ఎలా అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. పరవాడ మండల ఇంజనీరింగ్ అధికారిగా కొత్త వ్యక్తిని నియమించే వరకు తమలో ఒకరికి డిప్యూటేషన్ ఇవ్వాలని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కోరుతున్నారు. పరవాడ మండలంలో జరుగుతున్న ఈ విషయంపై ఇప్పటికే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ యూనియన్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని తక్షణమే అనధికారి వ్యక్తిని తమ పై అజమాయిషి చేయకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని అంటు ఇంజనీరింగ్ అధికారులు తీరుపై ఫిర్యాదు చేయటానికి సిద్ధమవుతున్నామని కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చెప్తున్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మండల ఇంజనీరింగ్ అధికారి విషయంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తే తమ పై స్థాయి అధికారులు తమను ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని అంటూ యూనియన్ ద్వారా జిల్లా కలెక్టర్కు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయించి అనధికార వ్యక్తి కార్యాలయంలో లేకుండా చేయాలని చూస్తున్నారు.

# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు సరైనదే

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వనరులను కోల్పోయిందని అన్నారు. 58 శాతం జనాభాతో 46 శాతం మాత్రమే ఆదాయాన్ని పొందామన్నారు. 42 శాతం జనాభా గల తెలంగాణ 54 శాతం ఆదాయాన్ని పొందిందని తెలిపారు. అభివృద్ధి కి కేంద్రమైన హైదరాబాద్ ను కోల్పోయామన్నారు. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాలలో కల్లా అతి తక్కువ తలసరి ఆదాయం గల రాష్ట్రంగా మారిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో అతి తక్కువ పట్టణీకరణ జరిగిన రాష్ట్రంగా వుందన్నారు. భారత దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయ రంగ వాటా 20శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్ లో 38 శాతం వుందన్నారు. నూతన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అప్పులు దాదాపు 10 లక్షల కోట్ల రూపాయలు ఉన్నాయని ప్రకటించిందని తెలిపారు. ఇవి గాక మరో రెండు లక్షల కోట్లు రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటి ఇచ్చిందని, ప్రభుత్వ రాబడిని , ఆస్తుల ను సహితం తాకట్టు పెట్టి ఋణాలు పొందారని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక రంగాలు అభివృద్ధి చెందితేనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. 1990లో ఇండియా, చైనా దేశాల తలసరి ఆదాయం సమానంగా ఉంటే నేడు చైనా మన కన్నా ఐదు రెట్లు అధికంగా తలసరి ఆదాయం కల్గి వుందన్నారు.

భారత జనాభాలో 35 సంవత్సరాల లోపు వారు 65 శాతం మంది ఉన్నారన్నారు. పరిపాలన, అధికార వికేంద్రీకరణ జరగాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు రాష్ట్రానికి రప్పించుకోవాలని, ఆయా ప్రాజెక్టులకు కావలసిన భూమి, నగదు వాటాను చెల్లించి ప్రాజెక్టులను, స్కీంలను రాష్ట్రానికి రప్పించుకోవాలన్నారు. . ఈ కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పి హరి ప్రకాష్, పూర్వ వైస్ ఛాన్సలర్స్ ఆర్. సుదర్శన్ రావు, ఎస్. రామ క్రిష్ణారావు, ప్రొఫెసర్ అవధాని, ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, డా. గంగా రామ్, మారుపల్లి పైడ రాజు, రామారావు, హౌనాక్, ప్రగడ వాసు తదితరులు ప్రసంగించారు.

# పొగాకు దుష్ప్రభావాలు వివరిస్తూ హెచ్‌సీజీ హెల్త్ క్యాంపైన్



**విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్ :** పొగాకు వినియోగం వల్ల కలిగే విషపూరిత ప్రభావాలను గురించి నొక్కిచెప్పడానికి మరియు ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడానికి 'హావ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' అనే పేరుతో ఒక ఆసక్తికరమైన ఇంటరాక్టివ్ హెల్త్ క్యాంపెయిన్‌ను వైజాగ్ లోని హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ నిర్వహించింది. టీ స్టాల్స్‌లో టీ సిగరెట్‌లు తాగడానికి గుమిగూడే వినియోగదారులకు 'హావ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' అనే ఆకర్షణీయమైన నినాదంతో టీకప్పులను హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్, వైజాగ్ పంపిణీ చేసింది. ఆరోగ్యకరమైన జీవనశైలితో టీని అనుబంధించేటప్పుడు పొగాకు యొక్క హానికరమైన ప్రభావాలను ప్రజలకు గుర్తు చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమం ద్వారా నగరవాసులపై శాశ్వత ముద్రను సృష్టించడం, వారి అలవాట్లను పునఃపరిశీలించుకోమని ప్రోత్సహించడం మరియు వారి శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, చివరికి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ ప్రచారానికి విశేషమైన రీతిలో సానుకూల స్పందన లభించింది. హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, రీజినల్ బిజినెస్ హెడ్ ఏపీ ,ఈస్ట్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, "ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలనే మా నిబద్ధతలో భాగంగా, హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్, వైజాగ్, 'హావ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' ప్రచారాన్ని ప్రారంభించింది. స్థానిక టీ స్టాల్స్‌లో ఆకర్షణీయమైన నినాదంతో కూడిన టీ కప్‌లను పంపిణీ చేయడం ద్వారా, పొగాకు యొక్క హానికరమైన ప్రభావాలను మన కమ్యూనిటీకి గుర్తుచేయాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. అదే సమయంలో సిగరెట్ లేకుండా టీని ఆస్వాదించమని వారిని ప్రోత్సహించాము అని అన్నారు.

# రజకలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి

## విజయనగరం పార్లమెంటరీ రజిక కన్వీనర్ గురజాపు రాము



**రణస్థలం, జూలై 28, మేజర్‌న్యూస్:** రజకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని విజయనగరం పార్లమెంటరీ రజిక కన్వీనర్ గురజాపు రాము అన్నారు. శనివారం అమరావతి రాజధానిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని మర్యాద పూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ తో మాట్లాడుతూ రజకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో రజకులు 90% టిడిపి తోనే ఉన్నారని, రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గడచిన సార్వత్రిక ఎన్నికలలో 50 సంవత్సరాలు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వటం పట్ల సంతోషిస్తున్నామని అన్నారు. గత వైకాపా పాలనలో రజకులపై దాడులు దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. టిడిపి పాలనలో రజకులు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని ఆశిస్తున్నామని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు , అన్నా క్యాంటీన్లు పునరుద్ధరించడంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.

# పొన్నాడ వెంకట తులసీరామ్‌కు అంతర్జాతీయ విశిష్ట పరిశోధనా అవార్డు




**నరసన్నపేట, జూలై 28, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణానికి చెందిన డాక్టర్ పొన్నాడ వెంకట తులసిరామ్‌కు ఐయస్‌యస్ యన్ తిరుచ్చి, తమిళనాడు వారు ఏరోస్పేస్ అండ్ హెల్త్ కేర్ ( సేఫ్టీ క్రిటికల్ సిస్టం ) విభాగం లో అంతర్జాతీయ విశిష్ఠ పరిశోధన అవార్డు ను ప్రదానం చేశారు. ఈయన నాగార్జున విశ్వవిద్యాలయం లో పెనుమోనియా అండ్ లంగ్ కాన్సర్ నిర్ధారిత సాఫ్ట్వేర్ సిస్టంలో పరిశోధన చేసి డాక్టరేట్ ను తీసుకున్నారు. ఈయన పలు అంతర్జాతీయ పరిశోధన పత్రాలు మరియు గ్రంథాలు వ్రాసారు. పొన్నాడ వెంకట తులసీరామ్ చేసిన పరిశోధనకు ఐ ఎస్ఎస్ఎన్ , తిరుచ్చి వారు ఈ అవార్డు ను అందించారు. ప్రస్తుతం ఫ్లోరిడా, అమెరికాకు చెందిన ఒక ఏరోస్పేస్ సంస్థ లో ఉద్యోగం చేస్తున్నారు. ఈయనకు ఈ అవార్డు రావడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

## గో హంతకులపై రౌడీ షీట్లు ఓపెన్ చెయ్యాలి

### గో సంరక్షణ సమాఖ్య డిమాండ్



**విజయనగరం కలెక్టరేట్, జూలై 28, మేజర్‌న్యూస్:** వందలాది ఆవులను నరికి చంపినా కసాయి వారిపై రౌడీ షీట్లు ప్రారంభించా లని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు "జీవ బంధు 'లోగిశ. రామకృష్ణ అన్నారు.ఆదివారం ఉదయం 10గంటలనుండి మధ్యాన్నం 2వరకు స్వర్గధామం వద్ద వున్నా అక్రమ కబేలా ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా లోగిశ రామకృష్ణ దుతు గత ఇరవై ఏళ్ళుగా అక్రమంగా ఆవులను వదిస్తూ మాంసం కంపెనీ లకు ప్రతి రోజు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఈ కబెలా పై గతం లో పది కేసు లు నమోదు చేసిన ఆవుల నరికి వేత ఆగడం లేదన్నారు. తక్షణమే కబేలా తక్షణమే సీజ్ చెయ్యాలన్నారు. గోమాత ను కాపాడాలి అని నినాదాలు చేశారు ఈ కార్యక్రమం లో గోలగాన రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె వి ర్. సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు మద్దిల. సోంబాబు,పట్టణ మహిళా అధ్యక్షులు నీలాపు దేవి.కమిటీ సభ్యులు విశ్వ నాధ పల్లి రవికిరణ్, రెడ్డిపల్లి రవిశంకర్, వి యుగంధర్, ఎన్ సాయి కుమార్, నేతల శ్రీనివా రరావు, వద్దాది రమేష్, నిమ్మక నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో విచారణ పేరుతో హైడ్రామా!

### -ఆరోపణలు ఎదుర్కొన్న వారికి సహకారం -వన్ సైడ్‌గా విచారణ! పిర్యాదు దారుని ఊసెత్తని అధికార్లు -విద్యా శాఖా మంత్రికి ఫిర్యాదుకు పయనం

**మెరకముడిదాం, జూలై 28, మేజర్‌న్యూస్:** గర్భాం మోడల్ స్కూల్ లో ప్రిన్స్ పాల్ పై వచ్చిన పలు ఆరోపణలపై ఎట్టకేలకు మూడు రోజులు కిందట గుట్టు చప్పుడు కాకుండా విచారణ జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరోపణ చేసిన వారు లేకుండా విచారణ చేపట్టిన అధికారులు అంతా ఒక్కటై, ఒన్ సైడు విచారణ జరిపి నాలుగు గోడల మధ్య ముగించేసారని విమర్శలున్నాయి. విచారణ జరిగేటప్పుడు ఆరోపణలు మోపబడ్డ వారిని, ఆరోపణలు చేసిన చేసిన వారిని పిలిచి విచారణ చేయాలి. అలా కాకుండా ఆరోపణ ఎదుర్కొన్న ప్రిన్స్ పాల్ ఒక్కరితో విచారణ చెపడితే నిజాలు ఎలా బయట పడతాయని ఫిర్యాదు దారులు ప్రశ్నిస్తున్నారు.విచారణ అధికారులుగా నియమింపబడ్డ వారు స్థానిక ఉపాధ్యాయులు కావడంతో "స్వాభిమానం" చూపెట్టుకున్నారని ఆరోపణలూ ఉన్నాయి. వారు ఒన్ సైడుగా విచారణను చేపట్టి ఆరోపణలు చేసిన వారిని పరిగణన లోకి తీసుకోపోవడ పై విచారణను తప్పు తోవ పట్టించారని సమాచారం. సాధారణంగా ఆరోపణలు చేసిన వారిని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని దగ్గర పెట్టి విచారణ చేయాలి. అప్పుడే నిజాలు వెలుగులోకి వస్తాయి. దీనికి విచారణ అధికారులు తిలోదకాలు యిచ్చారు. ప్రిన్స్ పాల్ పై వచ్చిన ఆరోపణల జోలికి పోకుండా రాజకీయ ఒత్తిడి తో విచారణను మ,మా అనిపించారని, ప్రిన్స్ పాల్ పై ఆధారాలతో కూడిన ఆరోపణలు ఉన్నా వాటి జోలికి పోలేదని తెలుస్తొంది. వచ్చామా! వెళ్ళామా ! అన్నట్లు వీరి విచారణ సాగిందని విచారణ చేసే తీరును బట్టి చూస్తే తెలుస్తొంది. అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ప్రిన్స్ పాల్ ఇచ్చిన సమాధానంతోనే విచారణ ముగించుకొని అయితే "అంతా ఓకే" అని వెళ్లిపోయినట్లు బోగట్టా!. స్కూల్ లో జాయినింగ్ లో జరిగే అనేక అవక తవకలపై ఆధారాలతో ఉదాహరణ లు చూపిస్తూ వివరణాత్మక వార్తలు ప్రచురితం అయినా విచారణ అధికారులు వాటి గురించి ప్రస్తావించ లేదు. వీటిపై జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి స్పందించారు. ఎట్టకేలకు వార్తా కథనాలపై ముగ్గురు తో విచారణ జరిపించారు. అందులో ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక స్కూల్ అసిస్టెంట్, మండల విద్యాశాఖ అధికారి ఉన్నారు.

స్థానికులను నియమించడం తో న్యాయ బద్ధంగా జరగవలసిన విచారణ తూ, తూ మంత్రంగా జరిగిందని సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారినే విచారణ చేయడంతో ప్రిన్స్ పాల్ కు అనుకూలంగా రిపోర్టు రాసినట్లు "మేజర్ న్యూస్" కు సమాచారం అందింది. ఆరోపణలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తే వీరు ప్రిన్స్ పాల్ కు ఎలా క్లీన్ చిట్ ఇస్తారని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అవసరమైతే ఆ విషయాల బయటకు వస్తాయని బాధితులు చెబుతున్నారు. ఎప్పుడైతే ఆరోపణ చేసిన వారిని విచారణకు పిలవలేదో అప్పుడే విచారణ లో డొల్ల తనం బట్ట బయలు అయిందని తేట తెల్లమైనది. దీంతో విసిగి పోయి ఆరోపణలు చేసిన బాధితలు ఈ మొత్తం ఈ మోడల్ స్కూల్ పై వచ్చిన ఆరోపణలు పైనా, విచారణ జరిపిన అధికారుల తీరు పైనా, పూర్తి ఆధారాలతో బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని, రెండు,రోజుల్లో రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా.లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేసేందుకు కు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది.

## బస్సు పాస్ సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు

### ఉర్లాం ప్లస్ టు విద్యార్థులు



**నరసన్నపేట, జూలై 28, మేజర్ న్యూస్:** నరసన్నపేట మండలం ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టు చదువుతున్న విద్యార్థులకు శ్రీకాకుళం టు డిపో బస్ పాస్ సౌకర్యం కల్పించడం పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు కె. హర్షవర్ధన శర్మ ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. సుమారు 40 మంది విద్యార్థులు ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుండి ఉర్లాంలో ఇంటర్మీడియట్ చదువుతున్నారని వారికి ఈ బస్సు పాస్ సౌకర్యం ఎంతో లబ్ధి చేకూరుస్తుందని, ఆటోలలో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, విద్యార్థినుల విజ్ఞప్తి మేరకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడం పట్ల విద్యార్థులు కె. జనని, ఎమ్. ఢిల్లేశ్వరి ఇంకొంతమంది విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## గొండు శంకర్ విజయం స్ఫూర్తిదాయకం

### -అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బిక్షమయ్య -యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గొండు శంకర్‌కు ఘన సన్మానం



**శ్రీకాకుళం, జూలై 28, మేజర్‌న్యూస్:** యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం గొండు శంకర్ విజయం స్ఫూర్తిదాయకమని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బిక్షమయ్య గురూజీ అన్నారు. విజయవాడలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం గొండు శంకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గొండు శంకర్ సాధించిన చారిత్రాత్మక విజయం తమ అసోసియే షన్‌లో ఉత్సాహం నింపిందన్నారు. యోగా వలన క్రమశిక్షణ అలబడు తుందని ఆ క్రమశిక్షణతోనే గొండు శంకర్ ఇంతటి విజయాన్ని సాధించగలిగారని పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎ మ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సెప్టెంబర్ లో నిర్వహించే రాష్ట్ర పోటీలను శ్రీకాకు ళంలో నిర్వహించేలా అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించి చెప్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, భారత స్వామి మాన్ ట్రస్ట్ రా ష్ట్ర అధ్యక్షులు జొన్నలగడ్డ శ్రీనివాసులు, సెక్రటరీ పి ప్రేమ్ కుమార్, కార్యాలయ కార్యదర్శి డి దుర్గారావు, కోశాధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

## బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**శ్రీకాకుళం, జూలై 28, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం అంబేద్కర్ విజ్ఞాన మందిర ము నందు బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పేకేటి రామారావు గారి అధ్యక్షతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారి తాతారావు రాష్ట్ర కార్యదర్శి అలికాన ఆనందు జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్ కుమార్ మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తండాడి అనిల్ కుమార్ గొల్ల ఉమామహేశ్వరరావు విజయనగరం జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ శ్రీకాకుళం జిల్లా కోశాధికారి దుర్యోధన రావు మహిళా కార్యదర్శి రత్నం మరియు ఇతర నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పై సంఘం మరింతగా పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ సంఘం ఆవి ర్భావం నుండి మొదలుకొని సంఘం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉపాధ్యాయ సంక్షేమం కోసం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బిటిఏ చేసిన కృషిని వివరించారు రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన సామాజిక బాధ్యత ప్రధాన ఏజెండాగా సంఘం పనిచేయాలని సూచించారు అదేవిధంగా వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాయకులు మాట్లాడుతూ క్రమశిక్షణతో వ్యవహరిస్తూ సంఘ నిర్మాణానికి పాటుపడుతూ ఉపాధ్యాయ విద్యారంగాన్ని బోలోపేతం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయ విద్యారంగా సమస్యలపై చొరవ చూపి వీలైనంత వేగమే పరిష్కరించవలసిందిగా నాయకులు కోరారు.

## ఆ క్షణాలు అమూల్యం..!

### 34 ఏళ్ల నాటి మధుర క్షణాలను నెమరు వేసుకున్న రెడ్డిపల్లి శాంతినికేతన్ ఉపాధ్యాయులు



**విజయనగరం కలెక్టరేట్, జూలై 28, మేజర్‌న్యూస్:** ఆ క్షణాలు అమూల్యమైన వి అని విశాఖపట్నం జిల్లా, పద్మనాభం మండలం, రెడ్డిపల్లి శాంతినికేతన్ పాఠశాల ఉపాధ్యాయులు నెమరు వేసుకున్నారు. విజయనగరంలో మయూర హోటల్ లో ఆదివారం రెడ్డిపల్లి శాంతినికేతన్ లో గత 34 ఏళ్ల క్రితం పనిచేసిన ఉపాధ్యాయులంతా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అమెరికాలో స్థిరపడిన ఆ పాఠశాల పూర్వ విద్యార్థి బీకే మోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సూరకాసి నారాయణరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను వారి అనుభవాలను ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు బికే మోహన్, బోండా కాశి, అల్లు గిరి, మామిడి రాజశేఖర్, మామిడి సాయిరాం, రెడ్డిపల్లి శ్రీనివాస్, గత 34 ఏళ్ల క్రితం అక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు ఆర్.వి. నారాయణ, విజనగిరి శంకరరావు, పద్మనాభ రాజు, కిషోర్ కుమార్ , ఏ.కొండలరావు, గంట సోమశేఖర రావు, ఎం.కె. నాయుడు, జి శ్రీనివాసరావు, వంగల దారినాయుడు, పల్ల కృష్ణారావు,మట్ట శ్రీనివాసరావు, ఎన్.రామినాయుడు, గోపాలకృష్ణ, పర్లాకిమిడి వెంకటరావు, పొట్నూరు లక్ష్మణరావు తదితరులు మాట్లాడుతూ తమ జీవితాల్లో స్థిరపడటానికి, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి రెడ్డిపల్లి శాంతినికేతన్ ఎంతో దోహద పడిందన్నారు. ఉత్తరాంధ్రకు ఉన్నతమైన విద్యను అందించేందుకు పేదరికంలో ఉన్న తమను చదివించడంతోపాటు ఉద్యోగ అవకాశాన్ని ఇచ్చి తమని అప్పట్లో ఆదుకున్నారన్నారు. ఇంగ్లీష్ తెలుగు లెక్కలు జీకే ఫిజిక్స్ బయాలజీ తదితర సబ్జెక్టులకు ప్రత్యేక తరగతుల నిర్వహించి తరువాత పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడానికి దోహద పడింది అన్నారు చదువుతోపాటు సంస్కారం మానవతా విలువలు నేర్పిన ఏకైక పాఠశాల రెడ్డిపల్లి శాంతినికేతనన్నారు. 34 ఏళ్ల తర్వాత మళ్లీ ఇలా కలుసుకోవడం, ఆ మధుర క్షణాలను గుర్తు చేసుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఒక్కొక్కరు వారి వారి జీవితాల్లో స్థిరపడిన సందర్భాలను కుటుంబ నేపథ్యాలను వివరించారు. అప్పటి మిత్రులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని మనసారా మాట్లాడుకున్నారు. తమ జీవితాలకు పాఠశాల స్థాయిలో పునాదులు వేసిన ప్రిన్సిపాల్ నారాయణరావుకు జీవితాంతం రుణపడి ఉంటాం అంటూ వారు అభిప్రాయాలను వెళ్ళబుచ్చారు. ఉత్తరాంధ్రకు చక్కని విద్యను అందించే తరుణంలో నారాయణరావు విద్యార్థుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. 80 ఏళ్ల వయసులో కూడా ఆయన తమకోసం ఆలోచించడం ఆనందదాయకమన్నారు. ఇటువంటి మధుర క్షణాలు మళ్లీ మళ్లీ రావాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, చదువుకున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నంద బలగలో విద్యార్థులకు స్పెల్లింగ్ బీ పోటీలు



**తెర్లాం, జూలై 28, మేజర్‌న్యూస్:** నంద బలగ గ్రామం లో ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పెల్లింగ్ బీ పోటీలు నిర్వహించారు. ఆదివారం గ్రామ శివాలయం వీధి లో పోటీలు ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు డెల్టా అధ్యక్షులు ఎం. విజయ మోహన్ సారథ్యంలో విద్యారంగ తొలి చరిత్రలో ఈ పోటీలు ఏర్పాటు చేయడం విశేషం. సుమారు 96మంది విద్యార్థులు పాల్గొని ఆరు టీము లుగా ఏర్పడి డిక్టేషన్ స్పెల్లింగ్ బి పోటీలు నాలుగు రౌండు లో జరిగాయి. ఈ పోటీలలో వి.సాత్విక్ గ్రూప్ వారు 18పాయింట్లు సాధించి ప్రథమ విజేతగా నిలిచారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామం లో మా పిల్లల పట్ల శ్రద్ధ తీసుకొని ఈ విధంగా ఇంగ్లీష్ పదాలు పైన పోటీ లు నిర్వహించిన విజయ మోహన్ ఉపాధ్యాయ ద ను గ్రామస్తులు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సర్పంచ్ టి. సింహాచలం విద్యా కమిటి ఛైర్మన్ సింహాచలం ఉపాధ్యాయ లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఎంఇఓ లక్ష్మణరావు



**బొబ్బిలి, జూలై 28, మేజర్‌న్యూస్:** మన గ్రీన్ బెల్ట్ సౌజన్యంతో మా పాఠశాల పిరిడి మువ్వల వీధి లో ఆదివారం మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ మండల విద్యాశాఖ అధికారి శ్రీ చల్లా లక్ష్మణరావు, అధ్యక్షులు రమణమూర్తి, శ్రీమతి విజయ గౌరి గ్రీన్ బెల్ట్ క్రియాశీల మెంబర్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయడం మాటల తో చెప్పలేని ఆనందంగా ఉంది. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే అదితికి వినతి పత్రం ఇచ్చిన జెవివి



**విజయనగరం కలెక్టరేట్, జూలై 28, మేజర్‌న్యూస్:** జిల్లా కేంద్ర గ్రంథాలయం గురజాడ గ్రంథాలయంలో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి విజ్ఞప్తి చేశారు.గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజును కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జేవివి జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజి మాట్లాడుతూ విద్యల నగరమైన విజయనగరంలో గల గురజాడ కేంద్ర గ్రంథాలయంలో విజయనగరం,పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వందలాదిమంది నిరుద్యోగులు ప్రతిరోజు,ఏళ్ల తరబడి వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటారని అన్నారు. గ్రామీణ వ్యవసాయ కూలీ పిల్లలైనా వీరంతా గురజాడ గ్రంథాలయం సమీపంలో అద్దె గదుల్లో ఉంటూ, తల్లిదండ్రులు పంపించిన చాలీచాలని డబ్బులతో అద్దెలు చెల్లించుకుంటూ, ఒక పూట తింటే మరో పూట తినకుండా అర్ధాకలితో ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు గ్రంథాలయ ఆవరణలో అర్ధాకలితో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవుతుంటారని తెలిపారు. పేద ప్రజలు ఆకలి తీర్చే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నా క్యాంటీన్ విధానం ఎంతో మంచిదని, గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిరుపేదలైన యువతీ,యువకుల కోసం ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కోరినట్లు చెప్పారు. గురజాడ గ్రంథాలయంలో ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం వలన నిరుపేద నిరుద్యోగ యువతకు ఆర్థికంగా ఖర్చులు తగ్గి కడుపునిండా అన్నం దొరుకుతుందని,సమయం వృధా కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చొరవ చూపించి ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, నగర అధ్యక్షుడు షిణగం శివాజీ, నగర ప్రధాన కార్యదర్శి పి. షణ్ముఖరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

## కాలనీ వాసులుకి తీవ్ర ఇబ్బందులు



**వంగర, జూలై 28, మేజర్‌న్యూస్:** మం డలంలో ఓనెఅ గ్రహారం గ్రామంలో గిరిజన కాలనీచుట్టూ మురుగు నీరు నిల్వలు ఉండటం తో ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులుకు గురౌతుండ టంతో గిరిజనవాసులు ఆందోలన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, తదితర వాటివల్ల మురుగు నీరు కాలనీ చుట్టూ చుట్టి ముట్టి ఉండటం, మురుగు నీరు పోక పోవటం వల్ల పగల, రాత్రి దోమలు, దుర్గంధ మైన వాసనతో నిత్య ఇబ్బందులు తో సత మత మౌతున్నారు.ఇలాంటి వాతావరణంలో కాలనీలో ఉన్నటు వంటి గిరిజనులు ఎన్నో ఇబ్బందులకు పడుతున్నప్పటికీ ఎవ్వరూపట్టించుకోవటంలేదని అరోపి స్తున్నారు."వార్డుల్లో ఇళ్ల మధ్య వాడుక నీరు, వర్షపు నీరు నిలిచిపోతోంది. రోజుల తరబడి ఇదే దుస్థితి నెలకొంటుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గ్రామానికి శివారు ప్రాం తాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నారు. పరి స్థితి ఇంత దారుణంగా ఉన్నా అధి కారులు కన్నెత్తి చూడడం లేదని ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీ వాసులకు చేరువలో పంటపొలాలు ఉండటం, ఆ పొలాల కు వర్షపు నీరు,కాల్వ మడ్డు వలస ఎడమ కాల్వ నీరు పంటపోలాల్లోకి వచ్చుననూ ఈ కాలనీ పక్క నున్నటువంటి పల్లం కావటం,ఈ నీరు పోయే సరియైన మార్గం లేక పోవటం వల్ల కాలనీ గిరిజనవాసులు ఇబ్బందులు వర్ణా తీతంగా ఉంటాయి,ఉన్నాయి. ఈ నీటిని మురుగు కాలువల్లోకి ఈ నీటిని మళ్లించే ఏర్పాట్లు చేయా ల్సిందిగా కాలనీ వాసులు కోరుతున్నారు.శివారు ప్రాంతాల్లో ఇలాంటి ఇబ్బందులు ప్రజలకు లేకుండా ఇందుకు అనుగు ణంగా ఆయా ప్రాంతాల్లో ఆ మురుగు నీరు పోయే విధంగా డ్రైనేజీ వంటి సౌకర్యాలు కల్పించక పోవటంతో ఫలితంగా వాడుక నీరు, వర్షపు నీరు రోజుల తరబడి తిష్ఠ వేస్తోంది. పందులు సంచరించి వాతావరణాన్ని మరింత పాడుచేస్తు న్నాయి. అధికారులు తక్ష ణమే స్పందించా ల్సిందిగా కాలనీ వాసులు కోరుతున్నారు. ఇలాగే మరికొన్ని నెలలు ఉన్నట్లయితే వివిధ రకాల వ్యాధులతో పాటు, నరకం తప్పదని చెబు తున్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధి కారులు కల్పిం చుకొని ఈ సమస్యల నుండి పూర్తిస్థాయి పరి ష్కారాన్ని కల్పించాలని కోరుతున్నారు.



## ఇంటర్నేషనల్ జర్నల్లో పలాస యువకుడి థీసిస్



**పలాస, జూలై 28, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజ కవర్గం పలాస-కాశీబుగ్గ మున్సిపాలి టీ 20వ వార్డుకు చెందిన బమ్మిడి సంతోష్ కుమార్ రాసిన థీసిస్ ఇంటర్నేషనల్ జర్నల్ ప్రచురిత మైంది. ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్డీ స్కాలర్ గా ఉన్న సంతోష్ కుమార్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్పై సోఫియా ఎకనామిక్ ఇంపాక్ట్ అనే ద రూరల్ ఎకానమీ అనే అంశంపై రాసిన పేపర్ను యూజీసీ వారి సహకారంతో ఇంటర్నేషనల్ జర్నల్లో ప్రచురించారు. దీనిపై సంతోష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో వలసలు నివారించడానికి, గ్రామీణ స్థాయిలో ఆదాయాన్ని మెరుగుపరచడానికి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకంపై తాను ధిసిస్ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి గ్రామస్థాయిలో ఒక వ్యక్తి ఆదాయ స్థితిగతులు, జీవన స్థితిగతుల్ని స్టడీ చేసి పేపర్ ప్రజెంటేషన్ చేసి రాసి ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ప్రస్తుతం పలాస- కాశీబుగ్గ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులుగా పనిచేస్తున్నారు.

## రక్తం కొరత లేని జిల్లాను నిర్మించుకుందాం

### -అందరూ భాగస్వామ్యులమవుదాం -జిల్లా ప్రజలకు పిలుపునిచ్చిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ టీడీపీ తెలుగుమహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ -న్యూ ఆదిత్య వాకింగ్, జుంబా డాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం



**శ్రీకాకుళం, జూలై 28, మేజర్‌న్యూస్:** రక్తదానం మహాదానమని, రక్తదానం మరొకరి జీవితానికి వెలుగును ప్రసాదిస్తున్నదని, రక్తదాతలు ప్రాణదాతలని రక్తకొరత లేని జిల్లాగా శ్రీకాకుళం జిల్లాను తీర్చిదిద్దుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ టీడీపీ తెలుగుమహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ పిలుపునిచ్చారు. న్యూ ఆదిత్య వాకింగ్, జుంబా డాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని పీఎస్ ఎన్ఎం స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి శంకర్ మాట్లాడుతూ మహిళలు కూడా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం శు భపరిణామన్నారు. మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల సదరు వ్యక్తి ఆరోగ్యంగా ఉండడంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారని పేర్కొన్నారు. రక్తం గ్రూపులు వేరైనా రంగు మాత్రం ఒక్కటేనని మనిషి దినచర్య సక్రమంగా జరగాలంటే రక్త ప్రసరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. నేడు సకాలంలో రక్తం అందక చనిపోతున్నవారు ఎందర ఉన్నారని అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన ప్రసవాల సమయంలో రక్తం ఎంతో అవసరమవుతోందని తెలిపారు. దేశంలో ప్రతి రెండు సెకన్లకు ఒకరికి రక్తం అవసరమవుతుందని చెప్పారు. సరైన అవగాహన లేనందున రక్తదానం చేసేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని రక్తదాతలు ముందుకొస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చునని పిలుపునిచ్చారు. రక్తదానంతో జీవితంలో ఇబ్బందులొస్తాయని చాలా మంది బయపడుతుంటారని, వాస్తవానికి రక్తం ఇవ్వడం వల్ల సదరు వ్యక్తికి ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. వైద్యులు పరీక్షలు చేసి పూర్తి ఆరోగ్యవంతులని, సరిపోయినంత రక్తం ఉందని నిర్ధారించుకొన్న తరువాతే మన నుంచి రక్తం తీసుకుంటారని వివరించారు. రక్తదానం చేసిన తరువాత ఆరు నుంచి పన్నెండు వారాలలోపు వ్యక్తికి పూర్తి స్థాయిలో కొత్త రక్తం తయారవుతుందని ఎలాంటి రక్తహీనత సమస్యలు తలెత్తవని చెప్పారు. ఇటీవల ఆన్‌లైన్‌లో దాతల వివరాలు అందుబాటులో ఉంచుతూ కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చినప్పటికీ వీటి గురించి తెలియకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 107 మంది రక్తదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు కె. చెన్నకేశవరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి జగన్మోహనరావు, స్టార్ వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి. ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, కొంఖ్యాన మురళీ ఎస్. జోగినాయుడు స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి. లక్ష్మీ వి. వాసంతి ఎస్. సంజీవరావు, గోలీ ఉమా మహేశ్వర రావు, ఎం. మల్లిబాబు, వై .మోహన్, రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు పి. చైతన్య, బి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భాగస్వామ్య దినోత్సవం

### నవీన్ కుమార్ యాదవ్



**పలాస, జూలై 28, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం లో సామాజిక భాగస్వామ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయ సంఘాలతో సహకారాన్ని పెంపొందించడం మరియు నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం తిథి భోజనాలు పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం. శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు అయిన సోమవారం ముడిమించి నవీన్ కుమార్ యాదవ్ సహకారంతో ఏర్పాటు చేయుచున్న సహ బంతి భోజనాలకు మన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు యావన్మంది విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని ఒక ప్రకటనలో కోరారు.

# కేబుల్ ఎక్స్పోకి ఆపరేటర్లు తరలి రావాలి

## ఎక్స్ పోకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు హాజరు

అనకాపల్లి, జూలై 28, మేజర్‌న్యూస్: ఈనెల 29, 30, 31 తేదీలలో విజయవాడలో మూడు రోజులు పాటు భారీ ఎత్తున నిర్వహిస్తున్న కేబుల్ ఎక్స్పో కార్యక్రమంలో కేబుల్ టీవీ ఆపరేటర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకుడు కెవిఎస్ ప్రకాష్ ఆపరేట్లను కోరారు. ఆదివారం సంఘ నాయకులతో కలిసి ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని భారీ ఎత్తున నిర్వహిస్తున్న కనెక్ట్ ఏపీ 2024 కేబుల్ ఎక్స్ పో, టెక్నికల్ సెమినార్ కు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ముఖ్య అతిథిగాను, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యవస్థకు చెందిన నిష్ణాతులు అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ ఎక్స్ పో లో అనేక విలువైన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా జాతీయస్థాయిలో పేరొందిన దేశ, విదేశీ బ్రాండెడ్ కంపెనీలు వందలాది స్టాల్స్ ఏర్పాటు చేసి, తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సాంకేతిక సెమినార్ లో దినదినాభివృద్ధి చెందుతున్న డిజిటల్ యుగంలో సాంకేతిక అంశాలను అవగతం చేసుకుని, రానున్న రోజుల్లో ఆపరేటర్లు తమ మనుగడను ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి అన్నది పెద్దలు దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. ఇటువంటి సాంకేతిక ఎక్స్పో, సెమినార్ల ను పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, విజయవాడలో జరిగే ఎక్స్ పో ను ప్రభుత్వ సహాయంతో, ఆపరేటర్ల సంక్షేమ కోసం నిరంతరం పరితపించే పెద్దలు విజయవంతం చేయడానికి కొన్ని నెలలుగా తీవ్రంగా కృషి చేయడం గొప్ప శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో దాడి ఈశ్వరరావు, పొలమరశెట్టి ఈశ్వరరావు, నడిపల్లి నాగేశ్వరరావు, భేతి వెంకటరమణ, గెద్దం భాస్కరరావు, తానాం అప్పారావు, దొడ్డి రాజు పాల్గొన్నారు.

# పద్మనాభం మండల విజయోత్సవ సభను విజయవంతం చేయాలి



పద్మనాభం, జూలై 28, మేజర్‌న్యూస్: పద్మనాభం మండల కాంప్లెక్స్ లో ఈ నెల 31 వతేదీన సాయంత్రం నిర్వహించనున్న మండల స్థాయి విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు కోరాడ రమణ నాయకులను, కార్యకర్తలను కోరారు. పద్మనాభంలో ఉన్న జిల్లా పరిషత్ రహదారి బంగ్లాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కానున్న సందర్భంగా సుమారు ఐదువేల మందిని సభకు తీసుకురావడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఎన్నికల తరువాత మండలంలో ఇదే మొదటి సభ అని ఆయన అన్నారు. అలాగే మండలంలో టీడీపీలో వర్గవిబేదాలు లేవని ఆయన స్పష్టం చేసారు. మాజీ జెడ్పీటీసీ కె.దామోదరరావు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన మెజారిటీకి తగ్గట్టుగా ప్రజలను సేకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు లీలావతి, నాయకులు నందీష్, ఎర్రినాయుడు, నగేష్, ప్రసాదు, బుచ్చిపంతులు, పుప్పాల రమణ, గంగరాజు, అప్పలనాయుడు, వెంకటరావు, గణేష్, అన్నమయ్య, విజయబాబు, స్వామినాయుడు, సుమంత నాయుడు పాల్గొన్నారు.

## శాఖంబరి అమ్మవారి అవతారంలో ఘనంగా పూజలు



ఎస్ రాయవరం, జూలై 28, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో నూకంబిక అమ్మవారి ఆలయంలో అశాడ మాసం పురస్కరించుకొని గ్రామ దేవత అమ్మవారిఆలయంలో ఆదివారం శాఖంబరి అమ్మవారి గా అలకరించారు. ఉదయం నుండి అమ్మవారిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి అన్న సమారాధనలో పాల్గొని తీర్ద ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ప్రతిపత్తి సాధించాలి




అనకాపల్లి, జూలై 28, మేజర్‌న్యూస్: మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలని, ముఖ్యంగా ఆర్థికంగా స్వయం ప్రతిపత్తి సాధించాలని ఎస్ఐ రాములమ్మ అన్నారు. ఆదివారం తుమ్మపాలలో శారదావేలీ డెవలప్మెంట్ షేర్ ఆర్ట్ 29వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ ఐ రాములమ్మ మహిళా సమస్యలపై మాట్లాడారు. మహిళలు కోసం నూతన ఏర్పడిన చట్టాలు, ఆర్థికంగా, సామాజికంగా మహిళ ఎలా ఎదగాలి తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్ పర్సన్ బి. రామలక్ష్మి, సీఈవో కె. జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ




విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్: ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టిన సంఘటన ఆదివారం సాయంత్రం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరరావు అనే వ్యక్తి సీతమ్మధార నుంచి జాతీయ రహదారి మీదుగా అక్కయ్యపాలెం వైపు ఏపీ 31బీఎం 0629అనే నంబర్ కారులో వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడి పంజాబీ దాభా వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులు గుంతలో పాడిపోవడాన్ని ఈశ్వరరావు చూశాడు. దీంతో కారును రోడ్డు పక్కన నిలిపి వారిని కాపాడే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో గురుద్వారా నుంచి అక్కయ్యపాలెం వైపు వస్తున్న ఏపీ 39 యు 4149లారీ ఆగి ఉన్న కారును ఢీకొనడంతో కారు వెనుకభాగం నుజ్జయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కానప్పటికీ ప్రమాదం జరిగిన తీరు ఆందోళన కలిగించిందని స్థానికులు తెలిపారు. కారు ధ్వంసం కావడంతో యజమాని ఫిర్యాదు మేరకు సీఐ తమ్మినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ వాణిశ్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ అతి వేగంగా వాహనం నడపబట్టే ప్రమాదం చోటు చేసుకుందని ఆ ప్రాంత వాసులు తెలిపారు.

## ఆకట్టుకున్న జై జవాన్ నృత్యరూపకం



విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన జై జవాన్ నృత్యరూపకం అందర్నీ ఆకట్టుకుంది. 'యాక్మీ' సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల కళాభారతిలో నిర్వహించిన 'భారతీయం' వైభవంగా ముగిసింది. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులకు నివాళులర్పిస్తూ ఆ యుద్ధంలో పాల్గొన్న జవాన్లను సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ సైనికులనుద్దేశిస్తూ వారంతా దేశ ప్రజలకు కాపలాగా ఉంటున్నారని కొనియాడారు. సరిహద్దులో రక్షణ కవచంగా జవాన్లు నిలబడి ప్రాణ త్యాగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమానికి 'అప్ సబ్ కీ అవాజ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంస్థ అధ్యక్షులు శివ వడ్లమూడి ప్రోత్సాహంతో వడ్లపూడి భారతి గ్రూప్, వడ్లపూడి శ్రీవారాహి ఇంగ్లీష్ మీడియం స్కూల్ చిన్నారులు నృత్య ప్రదర్శన చేపట్టారు. సంస్థ జనరల్ సెక్రెటరీ కిరణ్ కుమార్ బావిశెట్టి, విద్యాసాగర్, కర్రి దినేష్ విహార్, రఘురాం, యోగి, ధనుంజయ్, రాఘవ, రాజేంద్ర ప్రసాద్ పాల్గొని యాక్మీ ప్రతాప్ సేవల్ని కొనియాడారు.

## శ్రీ నూకాంబిక అమ్మవారికి శాకాంబరి అలంకరణ



అనకాపల్లి, జూలై 28, మేజర్‌న్యూస్: ఉత్తరాంధ్ర ఇలివేల్పు అనకాపల్లిలోని గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆషాడ మాసం నాలుగవ ఆదివారం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు 100 కేజీల కూరగాయలు, 700 రకాల పళ్ళు, వ్యాపారవేత్త మల్ల జగ్గప్పారావు సహకారంతో 100 కేజీల కూరగాయలతో అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బందారు ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి స్థాపనకు ఐక్య రాజ్య సమితి ప్రయత్నించాలి

## ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్



విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్: పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధం సమసిపోవడానికి ఐక్యరాజ్యసమితి గట్టి ప్రయత్నం చేయాలని, వీటో దేశాలను నియంత్రించాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. దీన్ని అంతర్జాతీయ సమస్యగా పరిగణించి యుద్ధ నివారణకు ప్రయత్నించాలన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు భవన్లో ఇస్కఫ్, గ్లోబల్ నెట్వర్క్ సంయుక్తంగా నిర్వహించిన పాలస్తీనాకు సంఘీభావం సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల అక్కడి ప్రజల జీవన విధానం ఛిద్రంగా మారిందన్నారు.ఆసుపత్రులను సైతం నేలమట్టం కావడంతో యుద్ధ ఖైదీలు , పిల్లలు సైతం మృత్యువాత పడుతున్నారన్నారు. శాంతి ప్రక్రియ పూర్తిగా ఆగిపోయిందని, పరిష్కారానికి ప్రపంచ దేశాల సైతం సరేనా మద్దతు ఇవ్వడం లేదన్నారు. విటో పవర్స్ ప్రయోగించకుండా మిగతా దేశాలు ఉత్తిరి తెస్తేనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అభ్యుదయ భావాలు తగ్గిపోతున్నాయని, పేదరికం నిర్మూలనకు ఏ ప్రయత్నం జరగటం లేదన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు జేవి .ప్రభాకర్ మాట్లాడుతూ పాలస్తీనా పోరాటయోధుడు యూసర్ అరాఫత్ ఆ దేశ సుస్థిరత కోసం ఎంతో ప్రయత్నం చేశారన్నారు. అమెరికా వారి ఆయుధాల విక్రయం కోసం యుద్ధాలు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రధాన వక్త మాజీ విసి, ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాక ఉద్రిక్తత పరిస్థితి నెలకొందని ,గాజాను ఆక్రమించా యుద్ధ వాతావరణం నెలకొంది అన్నారు. పాలిస్తీనా గతంలో భారతదేశం మద్దతు కోరిందని, అయితే ఇటీవల ఇజ్రాయిల్ ను ప్రధాని మోదీ సందర్శించాక పరిస్థితులు మ్యారేజి అన్నారు. గుడికి పాలిస్తే నాకు ఐక్యరాజ్యసమితిలో పూర్తి సభ్యత్వం పొందలేకపోయింది అన్నారు. ఇప్పటికీ పరిశీలన లోనే ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ పాలసీనవాసులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు అన్నారు భారతదేశంలో కూడా ప్రమాదకర పరిస్థితిలో ఉందన్నారు. సిపిఐ పాలస్తీనాకు పూర్తిగా సంఘీభావం తెలియజేస్తుంది అని తెలిపారు.ఏ ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి దేవా, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుకుమారన్, సిపిఎం నాయకురాలు మణి ,శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వియత్నాం పర్యటన విజయవంతంగా ముగించిన రాజశేఖర్ దంపతులను ఘనంగా సత్కరించారు.

# వెంకటేశ్వర మెట్ట భూముల సమస్య త్వరలో పరిష్కారం

## విల్లూరి దంపతులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ హామీ



విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్: వెంకటేశ్వర మెట్ట దేవాదాయ భూముల సమస్య అతి త్వరలోనే పరిష్కారం కానుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి,జీవీఎంసీ 33వ వార్డ్ క్లస్టర్ ఇన్చార్జ్,టిడిపి రాష్ట్ర బీసీ గరవ సామాజిక వర్గం సాధికారక సమితి సభ్యురాలు తిరుమల దేవి చక్రవర్తి దంపతులు పల్లా స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి 2002 నుంచి వెంకటేశ్వర మెట్ట భూముల వివాదంపై పోరాడిన వివరాలు, అధికారులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను విజ్ఞాపన పత్రం ద్వారా పల్లా కు సమర్పించి వెంకటేశ్వర మెట్ట మీద ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం పరిది సర్వే నంబర్ 1450 లో 130 సంవత్సరాలు పైన రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్‌తో జీవిస్తున్న విషయాన్ని అయన దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన పల్లా మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యపై విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అసెంబ్లీలో ప్రస్తావించారని, అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి చాంబర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీ, తాను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో చర్చించినట్లు తెలిపారు. సదరు సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు పల్లా తెలిపారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా ఈ సమస్య పై పోరాడుతున్న విల్లూరి చక్రవర్తిని అభినందించారు.

# విద్యుత్‌శాఖ అధికారులు అల్లుకున్న నిర్లక్ష్యం



**-ప్రమాదకరంగా ఐరన్ స్తంభాలు**
**-చోద్యం చేస్తున్న విద్యుత్ అధికారులు**
**-చినుకుపడితే పవర్ కట్**

సంతబొమ్మాళి, జులై 28, మేజర్‌న్యూస్: విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంతో ఓవైపు సరఫరాకు అంతరాయం ఏర్పతుండగా, మరోవైపు ప్రజల ప్రాణాలకు ప్రమాదం తెచ్చేలా ఉంది. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మల గుండా వెళుతున్నా, ట్రాన్స్ఫార్మర్లకు తీగలు అల్లుకున్న వారు పట్టించుకోవడంలేదు. ప్రస్తుతం మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదకర పరి స్థితులు నెలకొని ఉన్నాయి. మండలంలో నౌపడ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు తీగలు అల్లుకున్నా, అదే గ్రామంలో పలు వీధులలో లో వోల్టేజి సమస్య ఉన్నప్పటికీ, పాత మేఘవరంలో లోఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న , మరువాడ పంచాయతీలో చొక్కరవాని పేట నుండి సూరడ అచ్చమ్మ ఇంటి వరకు విద్యుత్ కేబుల్ మొత్తం అతుకులతో ఉందని, వర్షాకాలంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు కనీసం స్పందించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతబొమ్మాళి నౌపడ సబ్ స్టేషన్ పరిధిలో కనీసం జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదు. ఫలితంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కొన్ని చోట్ల విద్యుత్ తీగల వరకు దట్టంగా పిచ్చి తీగలు పాకి ఉన్నాయి. దాంతో అటు ప్రజల ప్రాణాలకు ఇటు నోరులేని పశువుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. అంతేకాకుండా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో విద్యుత్ తీగలు చెట్ల మధ్య నుంచి వెళుతున్నాయి. దాంతో ఆ ప్రాంతంలో అటు విద్యార్థులు ప్రాణాలకు ఇటు పశువుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. నౌపడ సబ్ స్టేషన్ పరిధిలోగల రొయ్యల సాగుకు విద్యుత్ సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇస్తుంటారని బహిరంగ విమర్శలు ఉండనే ఉన్నాయి. నౌపడ మెయిన్ రోడ్డు వద్ద , పెద్ద వీధిలో ఉన్న ఐరన్ ఫోల్ లతో ప్రమాదం ఉన్నప్పటికీ మార్చే ప్రయత్నం కూడా చేయలేదని ప్రమాదం సంభవించిన తర్వాత దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించడం, లేదా ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం కన్నా నివారణ చర్యలు చేపట్టడం మంచిది కదా అని మండల ప్రజలు అంటున్నారు. ఇటీవల వర్షాలు కు చినుకు పడితే పవర్ కట్. ఎప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

**-కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు దర్యాప్తు**
**-ఎస్సై పి నారాయణ రావు**

పాచిపెంట, జూలై 28, మేజర్‌న్యూస్: మండలంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతం గల ఈత మాను వలస గ్రామానికి సమీపంలో అనుమానస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై పి నారాయణ రావు తెలిపారు. పోలీసుల వివరాలు ప్రకారం మండలంలో పద్మాపురం గ్రామానికి చెందిన కంటా రమేష్ (23) తండ్రి లేటు జగన్నాథం అను వ్యక్తి ఈనెల 23వ తేదీన వ్యక్తిగత పనుల కోసం బయటికి వెళ్లడం జరిగిందని, అయితే ఆనాటి నుండి ఆ వ్యక్తి రమేష్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఈరోజు 28వ తేదీన స్థానిక ఎస్సై పి నారాయణ రావు దర్యాప్తు చేయగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో గల ఈత మానువలస గ్రామానికి సమీపంలో ఒక కొండ వాగు వద్ద రమేష్ మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు.

వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కేసును ఎస్ ఐ పి నారాయణ రావు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# 29న ఏపీడబ్ల్యూజే జిల్లా మహా సభలు

విశాఖపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్: ఈ నెల 29న గోపాలపట్నంలోని కుమారి కల్యాణ మండపంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా మహా సభలు నిర్వహించనున్నారు. సమావేశాల్ని విజయవంతం చేయాలని సంఘం సీనియర్ నాయకులు, పూర్వ అధ్యక్షులు కె.రాము తెలిపారు. ఈ మేరకు ఆదివారం విజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో పెండిరగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సంఘం విశాఖ యూనిట్ అధ్యక్షులు ఆర్. రామచంద్రరావు మాట్లాడుతూ మహా సభలకు ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వీ. సుబ్బారావు, కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ కార్యవర్గ సభ్యులు, 'స్వామ్నా' రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు, యూనియన్ సీనియర్ నాయకులు ఎం.ఆర్.ఎన్. వర్మ, యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా విభాగ అధ్యక్షులు ఏచూరి శివ తదితరులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న యూనియన్ తమదేనన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్ మాట్లాడుతూ మహా సభల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కోశాధికారి కిల్లి ప్రకాశరావు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి వీలుగా జర్నలిస్టులందర్నీ కలుపుకొంటూ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు వాల్మీకీ నాగరాజు, డి. హరనాథ్, గొండు అచ్యుతరావు, కె. చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




## పారిశుధ్య కార్యక్రమంలో బాగంగా పద్మనాభంలో ఇరవై ఏళ్ల కాలువకు మోక్షం



పద్మనాభం, జూలై 28, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నాలుగు రోజుల నుండి సర్పంచ తాలాడ పాప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమంలో బాగంగా ఇరవై ఏళ్ల కిందట మరుగున పడిన కాలువకి మోక్షం కలిగింది. సర్పంచ పాప భర్త పద్మనాభం చొరవు తీసుకొని గ్రామంలో ఎస్.టి. కాలనీ నుండి అనంతుని కోనేరు వరకు ఉన్న కాలువకి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఇరవై ఏళ్ల కిందట నుండి చెత్తచెదారం, అక్రమణలతో నిండిపోయిన ఈ కాలువను పద్మనాభం జె.సి.పి.తో శుభ్రం చేయించారు. అలాగే ఆక్రమణల తొలగింపునకు కాలువకి ఇరుప్రక్కల ఉన్నవారు సహకరించారని పద్మనాభం తెలిపారు. అలాగే గ్రామంలో కూడా డ్రెయినేజీలను, మంచినీటి పధకాలను శుభ్రం చేసారని ఆయన అన్నారు.

## బొడ్డపాడు వైసీపీ అదీనంలో వున్నది



పలాస, జూలై 28, మేజర్‌న్యూస్: శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం బొడ్డపాడు పంచాయతీ వైసీపీ అదీనం లోవున్నది .ఉదాహరణకు పైన వున్న ఫోటో నిదర్శనం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పెన్షన్ కార్యక్రమం పంపిణీలో వైసీపీ నాయకులకు పిలిచి వాళ్ళతో పంపిణీ చేసిన తరువాత .మామిడి పల్లిలో డెంగ్యూ నివారణ కార్యక్రమం లో వైసీపీ సర్పంచ్ వాలంటీర్ లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొవటం ఒక ఉదాహరణ. .అలాగే నిన్న జరిగిన దోమలు నివారణ చర్యలు కోసం పొగ వెయ్యడం ..వైసీపీ వాళ్ళ ఆధ్వర్యం లో మనం అడిగితే మన పైన దాడిచేయ్యటానికి వొస్తున్నారు మన లో వారికి (వైసీపీ ) వారికి సపోర్ట్ చేస్తున్నావారు ఇప్పటికి అయినా కళ్ళు తెరవండి మనకు గ్రామ సమావేశం లో ఒక్క మాట చెప్పటానికి కూడా అవకాశం ఇవ్వలేదు ప్రతీ ఒక్కరూ గుర్తుకు తెచ్చికోవాలి ఒక వార్డ్ నంబర్ గా నేను వున్నాను ఒక్క సారి కూడా ప్రోటోకాల్ పాటించి నన్ను పిలవలేదు. ఇది నాయొక్క ఆవేదన అని ప్రకటన తెలిపారు

# ఫ్రీ జర్నీతో నెలకు రూ.250 కోట్ల భారం




పలాస, జూలై 28, మేజర్‌న్యూస్: తెలుగుదేశం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీ అమలుపై తెలంగాణ, కర్ణాటకలో అధ్యయనం చేసి అధికారులు నివేదిక సిద్ధం చేశారు. దీనిపై తెలుగుదేశం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించనున్నారు. ఈ పథకం వల్ల ఆర్టీసీపై నెలకు రూ.250 కోట్ల భారం పడుతుందని అంచనా. ప్రస్తుతం నిత్యం 15 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారట. పల్లె వెలుగు, అల్ట్రా, ఎక్స్ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో సర్వీసుల్లో ఫ్రీ జర్నీని ఆగస్టు నెల నుండి అమలు చేసే అవకాశం ఉంది.

# జర్నలిస్టు వారి జిల్లా మహా సభ




పలాస, జూలై 28, మేజర్‌న్యూస్: శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం పలాస లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు వారి ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా మహా సభలు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి అప్పలరాజు.

## సీతంపేట సంతను పరిశీలించిన పీవో రాహుల్ కుమార్ రెడ్డి



సీతంపేట, జులై 28, మేజర్‌న్యూస్: సీతంపేటలో జరిగే వారపు సంతను ఐటిడిఎ పీవో టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారంపరిశీలించారు. ఈ సందర్భంగా పైనాపిల్, ఇతర గిరిజన ఉత్పత్తుల ధరలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సంత అనంతరం పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు.అనంతరం ఆదలి వ్యూ పాయింట్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.శంభం ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో త్రాగునీటి సమస్యపై సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ సింహాచలం, జేఈ నాగభూషన్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నౌపడలో వైరల్ హెపటైటిస్ డే ర్యాలీ



సంతబొమ్మాళి, జులై 28 మేజర్‌న్యూస్: మండలంలో నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ నందిని ఆధ్వర్యంలో ఆదివారం వరల్డ్ హెపటైటిస్ డే ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వైద్యాధికారిని డాక్టర్ నందిని మాట్లాడుతూ కాలేయ వ్యాధి పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా ఈ వ్యాధిని అదుపులో ఉంచవచ్చని ఆమె తెలిపారు. హెపటైటిస్ బి, సి , వ్యాధులపై వహిస్తే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని వివరించారు. హెపటైటిస్ ఎ, బి,సి ,ఇ వంటి కాలేయ వ్యాధులు సంక్రమిత రక్తంతో సంబంధం ఉన్న రక్త ఉత్పత్తులను సంక్రమిత సిరంజీలు లేదా సూదులు పంచుకోవడం తల్లి నుండి శిశువు వరకు పుట్టుక సమయంలో సంక్రమణ రక్షణ లేని లైంగిక సంబంధాలు కలిగి ఉండడం సరైన శానిటేషన్ పాటించకపోవడం వంటి కారణముల వలన ఈ వ్యాధి సంక్రమిస్తుందని ఆమె తెలిపారు. ఈ క్రమంలో ఎంపీహెచ్ఈఓ గోవిందరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డీఈవో మోడల్ స్కూల్ సందర్శన

### -సెలవులో ఉన్న స్కూల్ ప్రిన్సిపాల్
### -విచారణకా! జనరల్ విజిటా! అంతా గోప్యం

**మెరకముడిదాం, జూలై 28, మేజర్‌న్యూస్:** జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం మెరకముడిదాం మండలం గర్భాం మోడల్ స్కూలును సందర్శించారు. ఆరోజున ఆరోపణలు ఎదుర్కొంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సెలవులో ఉన్నారు.అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు, స్కూలు ప్రిన్సిపాల్ ఆ రోజంతా అందుబాటులోకి రాలేదని తెలిసినది. ఉదయం 10 గంటలకు మోడల్ స్కూలుకు చేరుకున్న డీఈవో మధ్యాహ్నం 12 గంటల వరకు స్కూలు అధ్యాపకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసినది. డీఈవో స్కూలు సందర్శన రోజున ప్రిన్సిపాల్ సెలవులో ఉండటం గమనార్హము. అయితే జిల్లా విద్యాశాఖ అధికారి మోడల్ స్కూలు సందర్శన విచారణ నిమిత్తమా! లేదా జనరల్ విజిటా! తెలియ రావడం లేదు. అంతా గోప్యంగా ఉంచారు. దీనిపై ఏ విధమైన సమాచారం బయటకు రాలేదు. విద్యార్థులు జాయినింగ్ లో అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు విద్యార్థి తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డీఈఓ ను డిమాండ్ చేస్తున్నాయి. మొత్తానికి డీఈఓ మోడల్ స్కూలు సందర్శన రోజున ప్రిన్సిపాల్ సెలవు పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటో ఆ అధికారులకే తెలియాలి.

## వర్షం దాటికి ఇల్లు పడిపోయిన బాధితులకు పరామర్శ



**జి మాడుగుల, జూలై 28, మేజర్‌న్యూస్:** ఏజెన్సీ వ్యాప్తంగా గత పది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి కోల్పోయిన ఇళ్ల బాధితులకు జనసేనా పార్టీ నాయకుడు జర్ర అంకిత్ ఆదివారం పరామర్శించారు. జి.మాడుగుల మండలం సాడెకు గ్రామంలో నివసిస్తున్న కోటా లక్ష్మయ్య అనే గిరిజనుడు ఇంటి గోడ శనివారం రాత్రి కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న అంకిత్ బాధిత కుటుంబానికి పరామర్శించి, ప్రభుత్వం తరుపున బాధితులకు అడుకునేల అధికారులకు తెలియజేస్తానని అన్నారు.

## గౌరవ సలహాదారులకు ఘన సన్మానం

### -డాక్టర్ రామ్మోహనరావుకు శాలువ కప్పి సన్మానించిన ధనంజయరావు -తోటపల్లిలో కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం



**గరుగుబిల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు లుగా ఎంపికైన ప్రముఖ వైద్యులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన రావును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈమేరకు తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భగా గౌరవ సలహాదారులు డాక్టర్ రామ్మోహన రావుకు రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనంజయరావు, గౌరవ అధ్యక్షు రాలు కె మంగాదేవి, ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావులు శాలువ కప్పి ఘనంగా సన్మానిం చారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి మిమిక్రీశివ, కోశాధికారి మువ్వల వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు మహాలింగప్ప, కుళ్ళ య్యప్ప, వరప్రసాద్, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ పేటలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం

### -తనిఖీలు నిర్వహించిన వైద్యాధికారి డాక్టర్ కె కె సాగర్ వర్మ
### -రక్తహీనత నివారణపై సూచనలు, సలహాలు అందజేత



**గరుగుబిల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని సన్యాసిరాజుపేట గ్రామంలో గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వ ర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కయనీకరోతు సాగర్ వర్మ తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సాగర్ వర్మ మాట్లాడుతూ గర్భిణీల్లో రక్తహీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచిం చారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను నిర్వహించి గర్భిణీలకు అంద జేస్తున్న వైద్యసేవలపై డాక్టర్ సాగర్ వర్మ ఆరాతీశారు. మాతాశిశు సంర క్షణ కార్డుల్లో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చు, తగ్గులు గుర్తించి గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణీల్లో జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్ గా పరిగణించి సత్వరమే సమాచారం ఇవ్వాలన్నారు. డీహైడ్రేషన్ కు గురికాకుండా ఎక్కువగా నీరు, ద్రవరూప ఆహారాన్ని తీసుకోవాల ని గర్భిణీలకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధా రణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీ నత, హైరిస్క్ సమస్యలకు గర్భిణీలు గురికాకుండా ఉండేలా వైద్య, సిబ్బంది కృషి చేయాల న్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, ఏ ఎన్ ఎం వెంకటరమణమ్మ, వైద్య సిబ్బంది రమేష్ , ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం

**భీమునిపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్:** జోన్-1 జీవీఎంసీ జోనల్ కమిషనర్ వారు నేడు జోనల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం కొనసా గును. ఈ కార్యక్రమంలో జోన్-1 జీవీఎంసీ జోనల్ కమిషనర్ మరియు అధికా రులు పాల్గొని ప్రజల యొక్క వినతులను స్వీకరిస్తారని జోనల్ కమీషనర్ తెలిపారు.

## పలాసపురంలో అగ్నిప్రమాదం

**పలాస, జూలై 28, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పలాసపురంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. జరిగిన ప్రమాదంలో సంక రామారావు, బి.బైరాగి, బెండాళం మధు పశువుల పాకలు దగ్ధమయ్యాయి పలాసపురంలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. జరిగిన ప్రమాదంలో సంక రామారావు, బి.బైరాగి, బెండాళం మధు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. సమీపంలోని ఓ ఇంటికి కూడా నిప్పంటుకుంది. దీనిపై సమాచారం తెలిసిన వెంటనే సోంపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో రూ.70 వేల వరకు నష్టాన్ని నివారించామని అగ్నిమాపక అధికారి భాస్కరరావు తెలిపారు.. ప్రభుత్వం సర్పంచి బాధితులను ఆదుకోవాలని సర్పంచి తడక జోగారావు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఆస్తి పంట నష్టపోయిన గిరివాసులను ప్రభుత్వం ఆదుకుంటుంది

### మాజీ మంత్రి కిడారి



**దుంబ్రిగుడ, జూలై 28, మేజర్‌న్యూస్:** మన్య ప్రాంతంలోని కురిసిన భారీ వర్షాలతో ఆస్తి, పంటలు నష్టపోయిన గిరిజనులకు ప్రభుత్వం ఆదుకుంటుందని మాజీ మంత్రి కిడారి. శ్రావణ్ కుమార్ చెప్పారు. స్థానిక టిడిపి మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం విస్తృత పర్యటన చేశారు. చంపాపట్టి, కితలంగి కా జ్వే తోపాటు పంట పొలాలను పరిశీలించారు. చంపాపట్టి గెడ్డలో వంతెన నిర్మాణానికి వైకాపా ప్రభుత్వం అట్టహాసంగా శంకుస్థాపన చేసి శిలాఫలానికి పరిమితం చేసి గిరిజనులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కితలంగి కాజ్వే పునరుద్ధరణకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పంట నష్టాల అంచనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. వర్షాలతో నివాస గృహాలు కోల్పోయిన గిరిజన ప్రజానికానికి గృహాలు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని' అన్నారు. కితలంగి కాజ్వే పునరుద్ధరణకు ప్రతిపాదనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికను అందించాలని గిరిజన సంక్షేమశాఖ జిల్లా ఇంజినీరింగ్ అధికారిని ఫోన్ ద్వారా అభ్యర్థించారు. పంటలు ఆస్తి నష్టపోయిన గిరిజనులు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వ తప్పక అదుకుంటుందని ఆయన భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ కోశాధికారి ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కమ్మిడి సుబ్బారావు, టి ఎన్ టి యుసి ప్రధాన కార్యదర్శి స్వామి, ఎంపీటీసీ సభ్యురాలు గీత మండల కార్యదర్శి చినగెన్ను, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు సర్పంచి పాండురం గస్వామి మాజీ సర్పంచి వెంకటరాజు: మాజీ పీసిసిఎస్ అధ్యక్షుడు భాస్కరరావు నాయకులు సింహాద్రి నరాశయ్య, త్రినాథ్ బాంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

## కళా రంగంను ప్రేక్షక దేవుల్లే కాపాడాలి

### -రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ధనుంజయరావు -రేపటి తరంకు బహుమతిగా ఇవ్వాలి -కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలి



**గరుగుబిల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** కళా రంగంను ప్రేక్షక దేవుల్లే కాపాడాలని, ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయరావు అన్నారు. మండల పరిధిలో తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు భారతదేశం అని వివిధ సంస్కృతుల సమ్మేళ నంలో ఉన్నటువంటి ప్రజలు అనేక మైనటువంటి కళా రూపాలను కలిగి ఉన్నారన్నారు. రాష్ట్ర కళా కారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ నుండి కళాకారులకు మంచి ఆదరణ లభించేదని, ఇప్పుడు గత ప్రభుత్వం కళాకారులను వారి కళలను నిర్వీర్యం చేసిందన్నారు. అలాగే వందేళ్ళ చరిత్ర కలిగినటువంటి చింతామణి నాటకంను ఆపివేయడం అమానుసమని చింతామణి నాటకంను నమ్ముకుని అనేక మంది కళాకారులు జీవనం సాగించి ఉన్నారని, ప్రభుత్వం చింతామణి నాటకాన్ని నిలిపివేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ప్రజలను చైతన్య పరిచేందుకు కళలు ఎంతగానో ఉపయోగ పడ తాయని, గత ప్రభుత్వం కళా కారుల యొక్క ప్రయోజనాలను పూర్తిగా విడిచి పెట్టిందన్నారు. సామాజిక పింఛన్ లు మాదిరిగానే కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 50 ఏళ్లు పైబడిన ప్రతి కళాకారుడికి పింఛన్ వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే కళారూపాలు ఎంతగానో ఉపయో గపడ తాయని, సామాన్య ప్రజలను చైతన్య పరచడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. వ్యక్తి మానసిక ఉల్లాసానికి, వికాసానికి , సంగీతం ఎంతగానో దోహదపడుతుంద న్నారు. రాష్ట్రంలో అనేకమంది కళాకారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నార ని, కళాకారులను ఆదుకో వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో కళారూపాలు కనుమరు గవుతున్నాయన్నారు. కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ సలహా దారులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు మాట్లాడుతూ సరస్వతి కటాక్షం ఉన్నటువంటి కళామతల్లి బిడ్డలను ఆదుకోవా ల్సిన బాధ్యత ఎంతైనా ప్రభు త్వంపై ఉందని, అలాగే ఇప్పటికే కళారూపాలు కనుమరుగవు తున్నాయని, ప్రభుత్వాలు కళారూపాలను ప్రభుత్వం ప్రోత్సహించి భావితరాలకు కళలు పట్ల ఆసక్తి కలిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈసమావేశం లో రాష్ట్ర కళాకారులు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు కె మంగా దేవి, మిమిక్రీ శివ, మువ్వల వెంకటరమణ , కార్యవర్గ సభ్యులు మహాలింగప్ప (కర్నూలు), కుళ్ల య్యప్ప (అనంతపురం) , వరప్రసాద్ (ప్రకాశం) ,రాజబాబు (కాకి నాడ), తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొన్నా రు.

## జిల్లాకు మరో 480 మెట్రిక్ టన్నుల డిఏపి ఎరువుల రాక

### -38 రైతుసేవా కేంద్రాలకు పంపిణీకి ఏర్పాట్లు
### -జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు



**విజయనగరం బ్యూరో, జూలై 28, మేజర్‌న్యూస్:** ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైతులకు పంపిణీ చేసే నిమిత్తం 480 మెట్రిక్ టన్నుల డిఏపి ఎరువులతో కూడిన గూడ్సు రైలు వ్యాగన్ క్రిభ్‌కో కంపెనీ నుంచి జిల్లాకు చేరుకున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు తెలిపారు. యీ ఎరువులను ఇప్పటికే ఇండెంట్ పెట్టిన జిల్లాలోని 38 రైతుసేవా కేంద్రాలకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు మార్క్ ఫెడ్ మేనేజర్ విమలకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. నగరంలోని గూడ్సు షెడ్ కు వచ్చిన డిఏపి రేక్‌ను ఆయన జిల్లా మార్కుఫెడ్ మేనేజర్‌తో కలసి ఆదివారం పరిశీలించి, రైలు వ్యాగన్ నుంచి లారీల ద్వారా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు. యీ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతుసేవా కేంద్రాలకు డిఏపి, యూరియా పంపించడం జరిగిందన్నారు. రైతుసేవా కేంద్రాల్లో గానీ, ప్రైవేటు డీలర్ల వద్ద గానీ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే వెంటనే సంబంధిత రైతులు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని కోరారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగభూషణం, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు

## 50 మంది దివ్యాంగులకు షాపులు పంపిణీ

### 52.21 లక్షల సిద్ది ఆర్థిక సహాయంతో



**కొత్తవలస, జూలై 28, మేజర్‌న్యూస్:** మండలంలోని మంగళ పాలెం గ్రామంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఫర్ ఆధ్వర్యంలో సిద్ధి ఫౌండేషన్ వారి 52.21 లక్షల ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన ఐదు జిల్లాలో చెందిన దివ్యాంగులకు 50 మందికి ఉచితంగా 50 షాపులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్ధి ఫౌండేషన్ డీజీఎం సౌరబ్ బాజ్ యి. ఫార్మర్ డిఎండి ఎస్ వి ఎస్ రావు. అసోసియేషన్ మేనేజర్ శ్రీష్టి ఠాగూర్ హాజరయ్యారు ముందుగా ట్రస్ట్ ను సందర్శించి అనంతరం వారి చేతుల మీదుగా 50 మంది దివ్యాంగులకు 50 షాపులను ఉచితంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం సౌరబ్ బాజపయ్ మాట్లాడుతూ గతంలో మా సంస్థ ద్వారా 30 మంది దివ్యాంగులకు షాపులను అందజేశామని వారందరూ కూడా ఉపాధితో జీవిస్తున్నారని ఇప్పుడు 50 మందికి కిరాణా. బ్యాంగిల్ స్టోర్. ఫ్రూట్స్. లవర్స్ స్టేషనరీ వంటి చిన్న షాపులను వ్యాపారాలు చేసుకునేందుకు అందజేస్తున్నామని . అన్నారు. సంవత్సరం పాటు వ్యాపారాలు సాగించుకొని అనంతరం 50 పైసలు వడ్డీతో మా సంస్థ ద్వారా లక్ష రూపాయల వరకు రుణం సదుపాయం అందవచ్చని అన్నారు .గత 20 ఏళ్లుగా గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి ఎంతోమంది దివ్యాంగులకు సేవలు చేస్తున్న జగదీష్ బాబు ను అభినందించక తప్పదని అన్నారు. రానున్న రోజుల్లో మా సంస్థ ద్వారా మరిన్ని సహాయ సహకారాలు ఉంటాయని ఆయన అన్నారు. అలాగే 15 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఉపకారణాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు. వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర ట్రస్ట్ సభ్యులు దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## పాండ్రంగి గ్రామ పేకాట శిభిరంపై పద్మనాభం పోలీసులు దాడి

**పద్మనాభం, జూలై 28, మేజర్‌న్యూస్:** మండలంలో పాండ్రంగి గ్రామంలో ఇటుక బట్టీలలో పలువురు నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పద్మనాభం పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్.ఐ.జామి సురేష చెప్పారు. గ్రామస్థులు అందించిన సమాచారం ప్రకారం ఈ పేకాట శిభిరంపై దాడి చేసి వ్యక్తులతో పాటు వారివద్ద నుండి 12570 రూపాయల నగదు, ఆరు సెల్ ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

## నక్సల్ బరి ఉద్యమ నిర్మాత కామ్రేడ్ చారు మజుందార్



**పలాస, జూలై 28, మేజర్‌న్యూస్:** నక్సల్ బరి ఉద్యమ నిర్మాత నక్సలైట్ ఉద్యమ అగ్రనేత కామ్రేడ్ చారు మజుందారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కొనియాడారు, ఆదివారం నాడు పలాస మండలం చిన్న నీలావతి లో కామ్రేడ్ చారు మజుందార్ 52వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు ఈ సభకు (ఐఎఫ్టియు) భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. నక్సల్ బరి భారత రాజకీయ రంగస్థలం మీదకి ఎన్నడూ లేనంత బలంగా వర్గ పోరాటాన్ని ముందుకు తెచ్చింది వీర తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత 25 ఏళ్ల కాలంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీలు సిపిఐ, సిపిఎంలు పూర్తిగా పార్లమెంటరీ భ్రమల్లో కూరికిపోయాయి ఈ దేశంలో వ్యవసాయకి విప్లవానికి విజయవంతం చేయాలంటే సాయుధ పోరాటమే సరైన మార్గమని నమ్మారు అని మాధవరావు తెలిపారు. ఆయుధం తప్ప దేశ విముక్తికి మరో మార్గం లేదని చారు ప్రకటించారు. బెంగాల్ లో చిలుకూరు డివిజన్ నక్సల్బరీ ప్రాంతంలో జ్యోతి దారులకు వ్యతిరేకంగా సంతాలు ఆదివాసీల నడిపిన సాయుధ పోరు దేశంలో చర్చనీయాంసంగా మారింద అని తెలిపారు. 52 ఏడేండ్లగా భారతదేశంలో సాయుధ ఉద్యమాలు వివిధ ప్రాంతాల్లో నడుస్తున్నాయి ఈ పోరాట పిలుపుతో వీర శ్రీకాకుళ కామ్రేడ్స్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి సాయుధ పోరు నడిపారు. రాజ్యం దుర్మార్గంగా ఈ ఉద్యమం మీద దమనకాండను ప్రయోగించింది 1972లో బెంగాల్ పోలీసులు చారు మజుందార్ నీ పట్టుకొని చిత్రహింసలు పెట్టి 16 రోజులు వారు కస్టర్డ్ లో ఉంచుకున్నారు ఆయన అమరుడయ్యాడు 72 జూలై 28 నాడు అమరుడయ్యారు. చారు మజుందార్ పీడిత ప్రజల హృదయాల్లో 52 ఏండ్లగా బతికే ఉన్నాడు. అసమానతలు ఉన్న సమాజంలో ఉద్యమాలు అనివార్యం ఉద్యమాల్ని అణిచివేతకు పాల్పడుతూ అనిచివేస్తామని కోవడం మూర?త్వం. ముచ్చటగా మూడోసారి మోది సర్కార్ అధికారంలోకి వచ్చింది దేశానికి ఫాసిస్ట్ ప్రమాదం పొంచి ఉంది ఫాసిస్టు మోడీకి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలబడ్డది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా సాధించుకోవడంలో కేంద్రంతో తలపడాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉంది లేదంటే ప్రజలు కచ్చితంగా చంద్రబాబుని నిలవేస్తారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు ఈ సభలు అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సోర్ర. రామారావు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వంకల. పాపయ్య, సవర బంగ్లా కుమార్, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు బదకల ఈశ్వరమ్మ, మురిపింటి తాతారావు రాపాక చంద్రయ్య, కోదండరావు భూపతి పిడిఎస్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయంలో చదవడంమాకిష్టం కార్యక్రమం

### -గ్రంథాలయ నిర్వాహకులు మధుసూదనరావు
### -అధిక సంఖ్యలో పాల్గొన్న పాఠకులు



**గరుగుబిల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాల యంలో జిల్లా గ్రంథాల యసంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాలు మేరకు ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంను నిర్వహించారు. పద్యంలు, గద్యంలు, క్రీడా పోటీలను విద్యా ర్థులకు నిర్వహించారు. ఈసంద ర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలురకాల పుస్తకాలను సిద్ధం చేశామని వీటిని చదువు కోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయో గపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నా యన్నారు. గ్రంథాల యం లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న చదవ డం మాకిష్టం కార్యక్రమంను విజయ వంతంగా నిర్వహించడం తో పాటు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్ర మాలు నిర్వహించడం జరిగింద న్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడంమాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వా హకులు మధుసూదనరావు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టుబడిన వాహనాలు వేలం

### పాలకొండ డిఎస్‌పిజివి కృష్ణారావు సమక్షంలో వేలం నిర్వహణ



**గరుగుబిల్లి, జూలై 28, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆయా గ్రామాల పరిధి లో వివిధ సంద ర్భాల్లో పట్టుబడ్డ వాహనాలను ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవ రణలో పాలకొండ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి వి కృష్ణారావు సమక్షంలో వేలం వేశారు. ఆయా గ్రామాల పరిధిలో నాటుసారా, మద్యం సీసాలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఉంచడం జరిగిందన్నారు. గరుగుబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను డి ఎస్ పి జి వి కృష్ణారావు సమక్షంలో వేలం వేశారు. పార్వతీపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నిర్ణయించిన ధరకు పైబడి వేలం పాటను పాడాలని వేలం పాటలో పాల్గొన్న వారికి స్థానిక ఎస్సై వై అమ్మనరావు ముందుగా తెలియ జేశారు. వేలం పాటలో వాహనాలు దక్కించుకున్న వారికి వాహనాలను అంద జేయడం జరిగిందని ఎస్సై అమ్మనరావు చెప్పారు.

## ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే అదితికి వినతి పత్రం ఇచ్చిన జెవివి



**విజయనగరం టౌన్, జూలై 28, మేజర్‌న్యూస్:** జిల్లా కేంద్ర గ్రంథాలయం గురజాడ గ్రంథాలయంలో నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి విజ్ఞప్తి చేశారు.గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజును కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జేవివి జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజి మాట్లాడు తూ విద్యల నగరమైన విజయనగరంలో గల గురజాడ కేంద్ర గ్రంథాలయంలో విజయనగరం,పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వందలాదిమంది నిరుద్యోగులు ప్రతిరోజు,ఏళ్ల తరబడి వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటారని అన్నారు. గ్రామీణ వ్యవసాయ కూలీ పిల్లలైనా వీరంతా గురజాడ గ్రంథాలయం సమీపంలో అద్దె గదుల్లో ఉంటూ, తల్లిదండ్రులు పంపించిన చాలీచాలని డబ్బులతో అద్దెలు చెల్లించుకుంటూ, ఒక పూట తింటే మరో పూట తినకుండా అర్ధాకలితో ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు గ్రంథాలయ ఆవరణలో అర్ధాకలితో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవుతుంటారని తెలిపారు. పేద ప్రజలు ఆకలి తీర్చే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నా క్యాంటీన్ విధానం ఎంతో మంచిదని, గురజాడ కేంద్ర గ్రంథాలయంలో నిరుపేదలైన యువతీ,యువకుల కోసం ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కోరినట్లు చెప్పారు. గురజాడ గ్రంథాలయంలో ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం వలన నిరుపేద నిరుద్యోగ యువతకు ఆర్థికంగా ఖర్చులు తగ్గి కడుపునిండా అన్నం దొరుకుతుందని,సమయం వృధా కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చొరవ చూపించి ప్రత్యేక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, నగర అధ్యక్షుడు షిణగం శివాజీ, నగర ప్రధాన కార్యదర్శి పి. షణ్ముఖరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

## గంజాయి రవాణాలో పట్టుబడ్డ వాహనం బహిరంగ వేలం




**నర్సీపట్నం, జూలై 28, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ కి సంబంధించి తేది 05-02-2015 న 200 కిలోల గంజాయి రవాణా చేయుచుండగా పట్టుబడిన పల్లియో కారు కేసు విచారణ పూర్తి కాగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారం విశాఖపట్నం డిప్యూటీ కమీషనర్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారి ఆధ్వర్యంలో తేది : 29-07-2024 ఉదయం 10.00 గంటలకు నర్సీపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయబడును అని అధికారులు తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ధరావతు నిమితం ఐదువేల రూపాయలు నగదు రూపేణ చెల్లించవలెను మరియు వేలంలో పాల్గొనదలచిన వారు వారియొక్క అధర్ కార్డు నకలు తీసుకోనిరావలెను అని ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ కె. సునీల్ కుమార్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో నర్సీపట్నం వారు తెలియజేసినారు

